జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## జిత్వానీ సరే..రఘురామరాజు

# ఫిర్యాదుపై చర్యలేవీ?

- పీఎస్సార్, రాణా, గున్నీపై సస్పెన్షన్ వేటు
- సస్పెండ్ చేస్తూ సర్కారు నిర్ణయం
- జిత్వానీ కేసులో కీలక మలుపు
- జిత్వానీ ఫిర్యాదు సరే.. రఘురామరాజు ఫిర్యాదుపై చర్యలేవీ?
- ఐపిఎస్ సునీల్‌పై గత జులైలోనే ఎఫ్ఐఆర్
- పారిపోయిన విజయపాల్‌ను పట్టుకోలేని పోలీసులు
- ఇంతవరకూ సస్పెండ్ చేయని వైనంపై టీడీపీ సోల్జర్స్ అసంతృప్తి
- అప్పటి మరో ఏడీసీపీని వదిలేయడంపై విస్మయం
- జిత్వానీ కేసుతోపాటు, బోండాపై అక్రమ కేసుకు యత్నం
- జగన్‌పై రాళ్ల కేసుపై బాబును ఇరికించే యత్నం
- ఆ అధికారిని వదిలేయడంపై పోలీసు వర్గాల్లో ఆశ్చర్యం

(మార్తి సుబ్రహ్మణ్యం)






ముంబయి నటి కాదంబరి జిత్వానీ కుటుంబ సభ్యులను తీసుకువచ్చి.. వారిని వేధించి జైలుకు పంపించేందు కారణమైన ముగ్గురు ఐపిఎస్ అధికారులపై కూటమి సర్కారు ఎట్టకేలకు వేటు వేసింది. నాటి నిఘాదళపతి పీఎస్సార్ ఆంజ నేయులు, విజయవాడ సీపీ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేయడం సంచలనం సృష్టించింది.


రెండురోజుల క్రితమే ముంబయి నుంచి వచ్చిన జిత్వానీ, ఆ ముగ్గురు అధికారులపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే చంద్రబాబునాయుడు ప్రభుత్వం వారిపై ఇంత వేగంగా చర్యలు తీసుకుంటుందని ఎవరూ ఊహించలేదు. నిజానికి డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ కేసుపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి.. ముందు తన స్థాయిలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఏసీపీ హన్మంతరావును సస్పెండ్ చేశారు. దానితో ప్రభుత్వం కూడా డీజీపీ నివేదిక ప్రకారం ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేసింది.

తాజా పరిణామాలు కూటమి శ్రేణుల సంతృప్తికి కారణమయ్యాయి. సాయంత్రం నుంచి టీడీపీ సోషల్‌మీడియా గ్రూపులలో, చంద్రబాబు తీసుకున్న ఈ సంచలన నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది. జగన్ జమానాలో ఆ పార్టీ కార్యకర్తలుగా పనిచేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడంలో, బాబు ప్రభుత్వం భయపడుతోందంటూ.. ఇదే సోషల్‌మీడియా సైనికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే వారిని సస్పెండ్ చేయడంతో, శభాష్ బాబూ అని కితాబులిచ్చే వారి సంఖ్య వేలకు చేరడం ప్రస్తావనార్హం.

మిగతా.. 2లో

## సగటు మనిషికి అందుబాటులో సబ్ రిజిస్ట్రార్

- రాచరికపు పోకడలకు స్వస్తి పలుకుతూ అదేశాలు జారీ చేసిన ఆర్ పి సిసోడియా
- న్యాయస్థానాలలో న్యాయమూర్తి తరహాలో కూర్చునే విధానానికి చెల్లుచీటి
- ఎత్తైన పోడియం, ప్రత్యేకంగా ఉండే కుర్చీ, అడ్డుగా ఎర్రని వస్త్రం ఇక కనిపించవు
- కొనుగోలు, అమ్మకం దారులకు తగిన గౌరవం లభించేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా ప్రభుత్వ అదేశాలు



BEFORE AND AFTER SRO AKIVIDU

**అమరావతి,మహానాడు:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇకపై రాజరికపు పొకడలు కనిపించవు. న్యాయ స్థానాలలో న్యాయమూర్తుల తరహాలో సబ్ రిజిస్ట్రార్లు కూర్చొనే విధానానికి చెల్లు చీటి పలికేలా రిజిస్ట్రేషన్‌ల శాఖ నిర్ణయం తీసుకుంది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల రూపురేఖల మార్పుకు సంబంధించి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తాజా అదేశాలు జారీ చేశారు.

మిగతా.. 2లో

## ‘షిర్డిసాయి’ని కాపాడుతుందెవరు?

(సుబ్బు)

అందరినీ షిర్డిసాయి కాపాడతాడంటారు. కానీ జగన్ జమానాలో వేలకోట్ల రూపాయల కాంట్రాక్టులు పట్టేసి, వందల ఎకరాలు లీజుకు తీసుకున్న ఈ షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌ను మాత్రం మనుషులే రక్షిస్తున్నారు. మనుషులంటే.. ఐఏఎస్ అధికారులే.. సరే విద్యుత్‌శాఖలో షిర్డిసాయి రెడ్డిగారి వెలుగుల గురించి లెక్కే లేదనుకోండి. జగన్ జమానాలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారే ఆయన బంధువు మరి. అవసరం లేకుండా వేలసంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు తయారీ చేసిన ఘనత ఆ కంపెనీది.

దాని అక్రమాలపై ఎన్నికల ముందు ఒక సోమిరెడ్డి.. మరో పట్టాభి.. ఇంకో జీవీరెడ్డి.. ఒక లంకా దినకర్. ఇలా అంతా అస్త్రశస్త్రాలు సంధించారు. సోమిరెడ్డి అయితే ఏకంగా షిర్డిసాయి అక్రమాలపై కేసే వేశారు. అదిప్పుడు వాయిదాల




పర్వంలో ఉంది. అది జగన్ బినామీ కంపెనీ అని, కూటమి అధికారంలోకి వస్తే దాని సంగతి తేలుస్తామని హెచ్చరించారు. వాటి అనుమతులు రద్దు చేసి, ప్రభుత్వం ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకుంటామని భరోసా ఇచ్చారు. సదరు కడపరెడ్డి గారి కంపెనీ బొక్కిన సంపదను కక్కిస్తామని ఆవేశపడ్డారు.

ఎన్నికలు ముగిశాయి. కూటమి నేతలు చేసిన ప్రజాయుద్ధంలో జగనన్న వైసీపీ ఓడిపోయి, బాబు-పవన్-లోకేష్ రెక్కల కష్టంతో కూటమి అధికారంలోకి వచ్చింది. మరి దానితో షిర్డిసాయి కంపెనీ విచారణకు వణికిపోవాలి కదా? తమకు ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకుంటుందని భయపడాలి కదా? కానీ అలాంటి భయపడే సీన్లేమీ లేవు. అంతా కూల్. పైగా..కెనడా కంపెనీకి తన 80 శాతం వాటా అమ్మేసేందుకు, కూటమి నేతలు ఆరోపించిన జగన్-ఆయన బినామీ సిద్ధమవుతున్నారు. దాని విలువ కేవలం 25 వేల కోట్ల రూపాయల పైమాటేనట. అంటే తన వాటా అమ్ముకునే జగన్‌కు 25 వేల కోట్లు సమకూరుతాయన్నమాట. ఈ డీల్‌ను సెట్ చేసిందెవరంటే.. పూర్వ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గారబ్బాయి.

అయితే దీనికీ- కూటమి సర్కారుకూ సంబంధమేమిటన్నది బుద్ధిజీవుల సందేహం. యస్.అక్కడికే వద్దాం. కెనడా కంపెనీకి అమ్మే ముందు.. సదరు కంపెనీలకు సినిమా కష్టాలు రాకుండా.. అంటే సదరు కంపెనీపై విజిలెన్స్ దాడులు, ఇచ్చిన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోకుండా ఉండటం గట్రాలన్నమాట! అందుకే ఈ యవ్వారాన్ని సెట్ చేయడానికి, ఇప్పటివరకూ సదరు షిర్డిసాయికి సహకరిస్తూ వస్తున్న ఓ ఐఏఎస్ అధికారిని రంగంలోకి దింపింది.

పాలకుడెవరైనా.. ఇం‘ధన’శాఖలోనే ‘విజయ’వంతంగా దశాబ్దాల నుంచి వెలిగిపోతూ.. అందరివాడిగా ఘనకీర్తి తెచ్చుకున్న ఆ అధికారి లైజనింగ్‌పై కడప రెడ్డిగారికి అంత గురి మరి! ప్రభుత్వంలో ఏ ఐఎఎస్ ఏడాదిన్నర,రెండేళ్లకు మించి ఆ శాఖల్లో ఉండరు. వారికి బదిలీలు తప్పనిసరి. కానీ ఈ ‘విజయ’వంతమైన అధికారికి మాత్రం, ఆ బదిలీలు మినహాయింపు. ఇం‘ధన’శాఖలో ఆయనకు మించిన మొనగాడు, నిపుణుడు మరొకరు లేనట్లు, ఏ సీఎం వచ్చినా ఆ శాఖను ఆయనే వెలిగిస్తుంటారు. అదొక ఆర్ట్ఆఫ్ లివింగ్!

దానితో రంగంలోకి దిగిన సదరు ఐఏఎస్ తన ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారట. కెనడా కంపెనీ కొనుగోలు చేయబోయే కడప రెడ్డిగారి కంపెనీని కరుణిస్తే.. ఇన్ని వేలకోట్లు ఇస్తారంటూ బంపర్ ఆఫర్ ఇస్తున్నారట. అన్నట్లు ఈ యవ్వారంలో ఓ ‘మెగా’ కంపెనీ కూడా ఉందట. మరి సీఎస్ పదవిపై కన్నేసిన సారు కలలు ఫలిస్తాయా? (అన్నట్లు తర్వాత కాబోయే సీఎస్ సారేనన్న ప్రచారం కూడా ఉంది) అసలు విద్యుత్ శాఖలో ఏం జరుగుతోంది? షిర్డిసాయి కంపెనీకి ఇచ్చిన భూములు ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు? తన ప్రాణాలనే పణంగా పెట్టి రాక్షసులపై యుద్ధంలో గెలిచి, కూటమిని నిలబెట్టిన చంద్రబాబును అధికారులు ఎందుకు? ఎలా? మోసం చేస్తున్నారు? ఆయన కళ్లకు ఎందుకు గంతలు కడుతున్నారు?..

త్వరలో మీ మహానాడులో..



### రాహుల్‌ను ప్రధాని చేసినప్పుడే

# ఫైనల్స్ గెలిచినట్లు

- మహేష్ గౌడ్ సౌమ్యుడు అనుకోవద్దు.. నేను ఆయన వెనకాలే ఉన్నా.
- రాబోయే పంట నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్
- రాజీనామా చేస్తానని చెప్పిన సన్నాసి హరీష్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడు?
- మా మంచి తనాన్ని చేతకానితనంగా తీసుకుంటే వీపు చింతపండే.
- టీజీ పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ పదవీ ప్రమాణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** మహేష్‌గౌడ్ తెలంగాణ పీసీసీ అధ్యక్షుడుగా పదవీబాధ్యతలు చేపట్టడం మనందరికీ ఆనంద దాయకం. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సోనియమ్మ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారు. 27 జూన్ 2021న నన్ను టీపీసీసీ అధ్యక్షుడుగా నియనించారు. 7 జూలై 2021న నేను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లా.

ఇంద్రవెల్లి నుంచి సమరశంఖం పూరించి, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాము. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల

మిగతా.. 2లో



03

మెరుగైన రహదారులు నిర్మిస్తాం...




04

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి



04

టీడీపీలో చేరికకు పవన్‌కు ఇదే సరైన సమయం!



07

నడి సముద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం!

## వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయొద్దు!

### ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి



**విజయవాడ, మహానాడు:** రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసి, వైద్య విద్యను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తున్నారా ? ఇప్పటికే వైద్య విద్య అందని ద్రాక్షలా మారిందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆమె మీడియాతో ఏమన్నారంటే...

మిగతా.. 2లో




### పటేల్ కాంగ్రెసోడైతే... విమోచన దినోత్సవాలు

# ఎందుకు జరపడం లేదు?

- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం కాదు... తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట...లేనప్పుడు మరోమాట
- తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తే మేమూ భాగస్వాములమవుతాం
- తెలంగాణ ప్రజలను హింసించిన రజకార్ల పార్టీతో అంటకాగుతారా?
- జై పాకిస్తాన్, జై పాలస్తీనా అని నినదించిన ఒవైసీని పొగుడుతారా?
- ఆపరేషన్ పోలోతో శస్త్రచికిత్స చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన మహనీయుడు పటేల్
- పరేడ్ మైదానంలో ‘ఫోటో ఎగ్జిబిషన్’ ను ప్రారంభించిన బండి సంజయ్
- తెలంగాణ విమోచన పోరాటాలను పాఠ్యాంశంగా చేర్చాలని కోరిన డాక్టర్ లక్ష్మణ్
- పరేడ్ మైదానంలో యువకులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడిన కేంద్ర మంత్రి

2లో

# పీఎస్సార్, రాణా, గున్నీ సస్పెన్షన్

**అమరావతి,మహానాడు:**

ముంబై నటి కాదంబరీ జెత్వానికి వైసీపీ పెద్దల వేధింపుల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గన్నీలపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు ముగ్గురి సస్పెన్షన్ ఫైల్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకం చేశారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఏసీపీ హనుమంతరావులను డీజీపీ సస్పెండ్ చేశారు. డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ముగ్గురు ఐపీఎస్ అధికారులపై కూడా వేటు పడింది. ఇందుకు సంబంధించిన



ఉత్తర్వులను, ప్రభుత్వం విడుదల చేసింది. జీవో నంబర్ 1590, 1591,1592 విడుదల చేసింది.

# వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయొద్దు!

(మొదటిపేజీ తరువాయి..)

పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? గుజరాత్ పీపీపీ విధానంపై ఎందుకు అధ్యాయనం చేయాలని అనుకున్నారు? జరుగుతున్న ప్రచారంపై ముఖ్యమంత్రి %ncbn వెంటనే నోరు విప్పాలి.

ప్రైవేటీకరణ పై సమాధానం చెప్పాలి. కూటమి సర్కార్ లో భాగస్వామ్య పక్షంగా ఉండి, ఈ ఏడాది 5 కొత్త కాలేజీలైన పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరుల్లో వసతులను కల్పించలేమని, నిర్వహించడం సాధ్యపడదని, అదనపు సీట్లు కూడా అవసరం లేదని.. మెడికల్ బోర్డు కి లేఖ రాయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రభుత్వ రంగంలో అదనపు సీట్లు వస్తుంటే ఏ రాష్ట్రమైనా వద్దనుకుంటుందా? ఇది కూటమి సర్కారుకు సిగ్గుచేటు.

కొత్తగా 750 సీట్లు సమకూరక పోవడం మీ నిర్లక్ష్యం ఫలితమే. లక్షలు పోసి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్న పిల్లల భవిష్యత్ ను అగమ్య గోచరంగా మార్చారు. విద్యార్థుల ఆశలను నీరు గార్చారు. మెడికల్ సీట్లకోసం పక్క రాష్ట్రాల బాట పట్టేలా చేస్తున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానం పెట్టి వైసీపీ సర్కార్ మెడికల్ సీట్లను అమ్ముకుంటే... ఆ విధానాన్ని రద్దు చేస్తామని మాట ఇచ్చిన కూటమి సర్కార్.. ఇప్పుడు అదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయి. కొత్త మెడికల్ కాలేజీల్లో వసతులను కల్పించి, ఈ ఏడాది నుంచే వాటిని ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.

# రాహుల్‌ను ప్రధాని చేసినప్పుడే ఫైనల్స్ గెలిచినట్లు

(మొదటిపేజీ తరువాయి..)

రైతు రుణమాఫీ చేసాం. రూ.18వేల కోట్లు, 23 లక్షల రైతుల ఖాతాల్లో వేసి...వ్యవసాయం పండగ అని నిరూపించాం. ఇదీ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత.

సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలనే నినాదంతో ఒకవైపు నేను, మరో వైపు భట్టి విక్రమార్క పల్లె పల్లెనా పాదయాత్ర చేసాం.ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ,మొదటి రెండు గ్యారెంటీలను అమలు చేసాం. ఇప్పటి వరకు 85కోట్ల మంది ఆడబిడ్డలు, ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేశారు..రాజీవ్ ఆరోగ్యశ్రీని 10లక్షలకు పెంచి పేదలకు వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాం.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ పేదల ఇండ్లల్లో వెలుగులు నింపుతున్నాం.



రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకుంటున్నాం.ఇచ్చిన మాట ప్రకారం పంద్రాగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతుల కళ్లలో ఆనందం చూశాం. పంద్రాగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని హరీష్ రావు సవాల్ విసిరారు. రాజీనామా చేస్తానని చెప్పిన ఆ సన్నాసి ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడు..?

రాబోయే పంట నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తాం. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని పాదయాత్రలో చెప్పాం.వాళ్ల ఉద్యోగాలు ఊడగొట్టిన మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చాం. మరిన్ని ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. నిరుద్యోగులకు నైపుణ్యం అందించేందుకు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిది.

వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దీక్ష పూనింది. త్వరలో తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. 2028లో ఒలింపిక్స్ లో దేశం తరపున బంగారు పథకాలు సాధించే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చే దిశగా ప్రయత్నం చేస్తున్నాం. ముచ్చెర్లలో ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్లాలి.

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలంటే, పూర్తి సమయాన్ని కేటాయించే పార్టీ అధ్యక్షుడు ఉండాలని అధిష్టానాన్ని కోరాం. మొన్నటి ఎన్నికల్లో గెలుపు సెమీ ఫైనల్స్ మాత్రమే.2029 లో ఫైనల్స్ ఉన్నాయి.ఢిల్లీలో ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగరేసి రాహుల్ ను ప్రధాని చేసినప్పుడే ఫైనల్స్ గెలిచినట్లు. రాష్ట్రంలో పదేళ్లు కాంగ్రెస్ దే అధికారం.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 పార్లమెంట్ స్థానాలు గెలిస్తేనే మనం ఫైనల్స్ గెలిచినట్టు. అప్పటి వరకు ఎవరూ విశ్రమించొద్దు..

నిన్న మొన్న కార్యకర్తలపై దాడులు చేసే ప్రయత్నం చేస్తున్నారు. మా కార్యకర్తలు ఎవరి జోలికి పోరు.ఎవరైనా మా మంచి తనాన్ని చేతకానితనంగా తీసుకుంటే వీపు చింతపండే.మహేష్ గౌడ్ సౌమ్యుడు అనుకోవద్దు. నేను ఆయన వెనకాలే ఉన్నా. రాబోయే మూడు నాలుగు నెలల్లో బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం. కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత మా నాయకులపై ఉంది.. మీ ఎన్నికలకు మా ఎన్నికల కంటే ఎక్కువ కష్టపడతాం.

# పటేల్ కాంగ్రెసోడైతే...

## విమోచన దినోత్సవాలు ఎందుకు జరపడం లేదు?

**హైదరాబాద్,మహానాడు:**

సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం ఎందుకు నిర్వహించడం లేదో సమాధానం చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' పేరుతో ఆ పార్టీ తెలంగాణ ప్రజలను వంచిస్తోందన్నారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస పార్టీ ప్రజలను వంచించినందున 'తెలంగాణ ప్రజా వంచన దినోత్సవాన్ని' నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రాచిరంపాన పెట్టిన రజకార్ల పార్టీ వారసులకు కాంగ్రెస్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు.

అంతకుముందు మాట్లాడిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ తెలంగాణ విమోచన పోరాటాలను పాఠ్యంశంగా పొందుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ విమోచనం కోసం జరిగిన పోరాటాలను, త్యాగాలను గుర్తు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం' నిర్వహిస్తోందని తెలిపారు.

తెలంగాణ విమోచన దినోత్సవాల నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తోపాటు పలువురు నేతలతో కలిసి ఫోటో ఎగ్జిబిషన్ ను బండి సంజయ్ తిలకించారు.

అనంతరం వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే... తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహించాలని మాట ఇచ్చిన తరువాత వరుసగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మోదీ ఆదేశాలు, అమిత్ షా సూచనల మేరకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ భాగమై ఈ ఉత్సవాలు నిర్వహిస్తోంది.

అందులో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఫోటో ఎగ్జిబిషన్ ను చూడగటానే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణకు విముక్తి కోసం చేసిన పోరాటాలు...సమర యోధుల త్యాగాలను కళ్లకు కట్టినట్లుగా చూపారు.

తెలంగాణ విమోచన కోసం జరిగిన పోరాటాల చరిత్రను 75 ఏళ్లపాటు తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారు. ఎన్నో ఏళ్ల పాటు తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని యువకులు జాతీయ జెండాలు పట్టుకుని ఉద్యమించారు. లాఠీదెబ్బలు తిన్నారు. ఎందుకంటే నాడు తెలంగాణ విమోచనం కోసం జరిగిన పోరాటాలు మామూలు విషయం కాదు. రజాకార్ల పాలనలో దారుణాలు అన్నీ ఇన్నీ కావు. బైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి సంఘటనలు ఇంకా కళ్ల ముందు మెదులుతున్నాయి. నగ్నంగా మహిళలను బతుకమ్మ ఆడించిన దురాగతాలు మరవలేం.

నిజాం నిరంకుశ పాలనపై కొమరం భీం, చాకలి ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామక్రిష్ణారావు, కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటాలను, హిందూ మహాసభ, ఆర్య సమాజ్ పోరాటాలను గుర్తుచేసేందుకు, రాబోయే తరాలకు ఈ చరిత్రను అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నాం.

తెలంగాణ విమోచన దినోత్సవానికి ప్రధాన కారకులు సర్దార్ వల్లభాయి పటేల్. దేశంలోని 562 సంస్థానాలు విలీనం చేసే క్రమంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసేందుకు నిజాం అంగీకరించలేదు. దేశమంతా స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు స్వాతంత్ర్యం రాకపోతే భారతమాత కడుపులో క్యాన్సర్ గడ్డ అట్లాగే ఉండిపోతుందనే ఉద్దేశంతో ఆపరేషన్ పోలోతో శస్త్ర చికిత్స చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన మహనీయుడు సర్దార్ వల్లభాయి పటేల్.

తెలంగాణ విమోచన దినోత్సవాలు జరిపే అర్హత బీజేపీకి లేదన్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై....మరి కాంగ్రెస్ కు మాత్రమే ఆ అర్హత ఉంటే ఇప్పటి వరకు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఎందుకు నిర్వహించడం లేదు? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నూ 50 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలించారు కదా.. మరి నాటి నుండి ఎందుకు నిర్వహించలేదు. నాటి తెలంగాణ పోరాట యోధులను ఎందుకు స్మరించలేదు? తెలంగాణ విమోచనం కోసం ఆపరేషన్ పోలో నిర్వహించిన సర్దార్ పటేల్ ను ఎన్నడైనా స్మరించిందా?

తెలంగాణ విమోచన దినోత్సవాలపై అధికారంలో లేనప్పుడు ఒకమాట... వచ్చాక మరోమాట... ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరు. ఒక పార్టీ ఏమో 'సెప్టెంబర్ 17న సమైక్యత దినోత్సవం' అంటది.. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ 'ప్రజాపాలనా దినోత్సవం' నిర్వహిస్తుందట. మరి దాదాపు 50 ఏళ్లు రాష్ట్రాన్ని ఏలారు కదా... ఇన్నాళ్లు మీరు చేసింది ప్రజా వంచనా? ప్రజా వంచన దినోత్సవంగా నిర్వహించుకోండి.

నేనడుగుతున్నా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పేరు మార్చి 'తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం' అని మార్చడానికి కారణమేంటి? బీజేపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ఒకటే మాట. తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలన్నదే మా లక్ష్యం. అదే చేస్తున్నం. తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా జరిపితే... మేమంతా పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

తెలంగాణ సాధన కోసం పోరాడిన 1500 మందిని బలిదానం చేసుకున్న పార్టీ కాంగ్రెస్. వారి ఉసురు తీసిన పార్టీ. వారి బలిదానాలతో తీవ్ర భావోగ్వేదానికి గురైన సుష్మాస్వరాజ్ ఎవ్వరూ చనిపోవద్దని పేర్కొంటూ తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో ఆమోదింపజేసి స్వరాష్ట్ర ఏర్పాటుకు క్రుషి చేసిన సంగతి మర్చిపోయారా?

నిజాం పాలనలో రజకార్ల దళం తెలంగాణ ప్రజలను ఊచ కోతకోసింది. మహిళలను బట్టలిప్పి బతుకమ్మ ఆడించింది. పరకాల, బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లిలో వందల మందిని బలి తీసుకుంది. అలాంటి రజకార్ల దళం పార్టీగా ఏర్పడితే... ఆ పార్టీ వారసుడైన ఒవైసీని సీఎం పొగడటం వెనుక ఉద్దేశమేంది?

జై పాలస్తీనా, జై పాకిస్తాన్ అనేటోళ్లకు వత్తాసు పలకడమంటే కాంగ్రెస్ దుర్మార్గాలకు పరాకాష్ట. ఒకవైపు రాహుల్ గాంధీ అమెరికాకు పోయి భారతదేశాన్ని కించపరుస్తున్నడు. ఇక్కడ ఒవైసీకి వత్తాసు పలికి తెలంగాణను సీఎం కించపరుస్తున్నడు. యధా రాజా తథ ప్రజ.

కాంగ్రెస్ ఆలోచన అంతా దేశాన్ని ముక్కలు చేయాలనే విధంగా మాట్లాడుతున్నట్లుంది.

# సగటు మనిషికి అందుబాటులో సబ్ రిజిస్ట్రార్

(మొదటిపేజీ తరువాయి..)

ప్రజలకు చేరువగా పరిపాలన ఉండాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు ఆంకాక్షల మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తీసుకున్నఈ కీలక నిర్ణయం ఫలితంగా ఇప్పటి వరకు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న విధానాలను సమూలంగా మార్చినట్లు అయ్యింది.

ప్రస్తుత విధానం అమర్యాదకరంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెంచేలా ఉందన్న విషయాన్ని గుర్తించిన రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ విధానం మార్పుకు శ్రీకారం చుట్టారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్లు కూర్చునే అమరిక ఉండేలని సిసోడియా ఇచ్చిన



ఆదేశాలు ఇప్పటికే అమలవుతున్నాయి.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమీషనర్ శేషగిరి బాబు ఇప్పటికే ఆ పనిలో ఉన్నారు. రెండు రోజులు సెలవు దినాలు రావటంతో మంగళవారం నాటికే కొత్త రూపుతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కనిపించేలా వేగవంతమైన చర్యలు చేపట్టారు.

సబ్ రిజిస్ట్రార్లు కూడా సామాన్యులేననే భావన కలిగేలా రెవెన్యూ శాఖ చేపట్టిన కసరత్తు మంచి ఫలితాలను ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేక ఎత్తైన పోడియం, బల్ల చుట్టూ ఉండే ఎర్రని వస్త్రం క్లాత్ కనిపించవు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ సైతం సగటు అధికారి మాదిరే ఉంటుంది. కుర్చీ, బల్లకు ప్రత్యేక వేదిక ఉండదు.

నేల ఎత్తులోనే అవి ఉండాలని, చుట్టూ ఎలాంటి పార్టిషన్ ఉండకూడదని సిసోడియా స్పష్టమైన అదేశాలు ఇచ్చారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌కి ప్రజలకు మధ్య టేబుల్‌తప్ప మరేమీ అడ్డంగా ఉండదు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు, వారి కంటే ఎత్తులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పోడియం ముందు నిలబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయటం ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానం.

భూములు రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుండగా, సామాన్య ప్రజలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యధిక గౌరవం దక్కాలన్నది ప్రభుత్వ భావనగా ఉంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలతో స్నేహపూర్వకంగా



ఉండేలా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగిన మర్యాదలు ఇవ్వాలని మెమో జారీ అయ్యింది. సబ్‌రిజిస్ట్రార్ ముందు సరిపడా కుర్చీలు అందుబాటులో ఉంచడం ద్వారా రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు కూర్చుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాజా ఆదేశాల ఫలితంగా రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యే వరకు కొనుగోలు, అమ్మకం దారులు నిలబడవలసిన అవసరం ఉండబోదు.

లావాదేవీల సమయంలో సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో కూర్చునే పని పూర్తి చేయించుకోవచ్చు. ఇటీవల సిసోడియా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలు నేపథ్యంలో అక్కడి బ్రిటీష్ పోకడలను గుర్తించి మార్పులు తప్పనిసరని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

# జిత్వానీ సరే..రఘురామరాజు ఫిర్యాదుపై చర్యలేవీ?

(మొదటిపేజీ తరువాయి..)

ఉండి ఎమ్మెల్యే, నాటి ఎంపి రఘురామకృష్ణంరాజును హైదరాబాద్ నుంచి చెరబట్టి, గుంటూరుకు తీసుకువచ్చి ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వ్యవహారంలో.. కీలకపాత్ర పోషించిన ఐపిఎస్ అధికారి సునీల్‌పై కేసు రెండునెలల క్రితమే నమోదయింది. తనను ఐపిఎస్ సునీల్‌తోపాటు అప్పటి పోలీసు అధికారి విజయ్‌పాల్ థర్డ్‌డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నం చేశారంటూ రఘురామజు జూన్ 11న గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అది జులై 11వ తేదీ నాటికి గానీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.

ఇప్పటికిమూడునెలలయినా కేసులో పురోగతి లేకపోగా.. నిందితుడిగా ఉన్న విజయపాల్ పరారీలో ఉండటం విశేషం. ఇప్పటిదాకా సునీల్‌ను సస్పెండ్ చేయకపోవడంపై, టీడీపీ సోషల్ మీడియా సైనికులు భగ్గుమంటున్నారు. ఎఫ్ఐఆర్ నమోదైన నిందితుడే ఐపిఎస్ అధికారయితే.. ఆయనను సస్పెండ్ చేయకుండా, ఆయన కింద స్థాయి అధికారి ఏవిధంగా స్వేచ్ఛగా విచారించగలరన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. జిత్వానీ కంటే ముందే ఫిర్యాదు చేసిన రఘురామ కృష్ణంరాజు కేసులో నిందితుడైన సునీల్‌ను వదిలేయటం ఏమిటన్న ప్రశ్నల వర్షం కురుస్తోంది. రెడ్‌బుక్ ఏమైంది? అంటూ టీడీపీ సోల్జర్స్ విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

'జిత్వానీ ఫిర్యాదు చేసిన 24 గంటల్లో ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేయడం గొప్ప విషయమే. ఇది కార్యకర్తల్లో పార్టీపై నమ్మకం పెంచే చర్యనే.

మరి ఇంకో ఐపిఎస్ సునీల్‌పై రెండునెలలక్రితమే ఫిర్యాదు చేసి, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైనా సునీల్ ఎందుకు సస్పెండ్ చేయలేదు? ఎఫ్ఐఆర్ నమోదైన అధికారులందరినీ ప్రభుత్వం అదేవిధంగా సస్పెండ్ చేయకుండా కొనసాగిస్తుందా?" అంటూ నెటిజన్లు ప్రశ్నలవర్షం సంధిస్తున్నారు.

జగన్‌కు ఉన్న ధైర్యం బాబుకు లేదని, డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావుకు రిటైర్మెంట్ చివరిరోజువరకూ పోస్టింగ్ ఇవ్వలేదని గుర్తు చేస్తూ.. అంత దమ్ము చంద్రబాబుకు లేదని ఇప్పటిదాకా కన్నెర్ర చేస్తూ వచ్చారు. "జగన్‌ను ధైర్యంగా ఎదిరించిన ఏబీకి ఇప్పటిదాకా న్యాయం చేయలేదు. అదే జగన్ అయితే ఏబీలాంటి వారిని పిలిచి పెద్దపీట వేసేవారు. అదీ జగన్-బాబుకు తేడా అంటూ కామెంట్లు కురిపిస్తూ వస్తున్నారు. అయితే ఒక్కసారిగా ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేయడం, వారిని సంతృప్తిపరిచినట్టయింది. దానితో చంద్రబాబు ధైర్యాన్ని, డీజీపీ నిర్ణయాన్ని తెగ మెచ్చుకుంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

అయితే.. ఇదే కేసులో చురుకైన పాత్ర పోషించిన, నాటి అడిషనల్ డీ సీపీని విడిచిపెట్టడంపై టీడీపీ కార్యకర్తల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

సదరు అధికారి ఎన్నికల ముందు, విజయవాడలో జగన్‌పై జరిగిన గులకరాయి కేసులో.. ఇప్పటి ఎమ్మెల్యే బోండా ఉమపై కేసు పెట్టి అరెస్టు చేసేందుకు అత్యుత్సాహం ప్రదర్శించారని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు.

అసలు చంద్రబాబునాయుడు రెచ్చగొట్టడం వల్ల, ఆయన మాటలకు ప్రభావితమైన దుండగులు జగన్‌పై రాళ్ల దాడితో హత్యాయత్నానికి ప్రయత్నించారన్న బిల్డప్ ఇచ్చారని టీడీపీ నేతలు చెబుతున్నారు.

అలాంటి అధికారి జిత్వానీ కేసులోనూ చురుకైన పాత్ర పోషించినప్పటికీ, ఆయనపై మాత్రం చర్యలు తీసుకోకపోవడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి ఇప్పుడు అమరావతి జిల్లాలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కాగా విచారణ ఇంకా పూర్తి కానందున, అందరిపై ఒకే సారి చర్యలు తీసుకోవడం కష్టమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బహుశా జిత్వానీ కేసులో, సదరు అధికారిని సాక్షిగా చూపించే అవకాశం ఉందంటున్నారు.

3

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024

## ఎంబీబీఎస్ సీట్లు అవసరం లేదని

# బాబు లేఖ రాయడం దారుణం

- మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తిచేస్తాం
- సీఎం చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ ట్వీట్



**అమరావతి,మహానాడు:** రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి, అవసరం లేదంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణం. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసే బృహత్తర యజ్ఞానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తన చేతులతో తానే భంగం కలిగించడం అత్యంత హేయం, దుర్మార్గం. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్లకోసం ప్రదక్షిణాలు చేస్తున్న పరిస్థితుల్లో, మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పిపంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం చంద్రబాబుగారూ?

నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రజలకు ఒక హక్కుగా అదించడం అన్నది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి, మంచి వైద్యం అందుకోవడానికి ఏ కుటుంబం కూడా ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకూడదు. ఈ బాధ్యతల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏ రకంగా తప్పించుకుంటుంది చంద్రబాబు గారూ? అలా తప్పించుకుంటే, దాన్ని ప్రభుత్వం అని అంటారా?

దీన్ని గుర్తించే వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రతి పార్లమెంటు నియోజక వర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించాం. దీనివల్ల ప్రభుత్వానికి ఏ రకంగా నష్టం వస్తుంది?

2023-24 సంవత్సరాల్లో 5 కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావడం నిజం కాదంటారా? తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాష్ట్రానికి రాలేదంటారా? చాలామంది పేద పిల్లలు సీట్లు సాధించి డాక్టర్ చదువులు చదవడం లేదా?

నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వెళ్తే ఈ ఏడాదిలోనే మరో 5 కాలేజీలు మదనపల్లె, పులివెందుల, ఆదోని, మార్కాపురం, పాడేరుల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు పాడేరు కాలేజీని 50 సీట్లకే పరిమితం చేయడం ఏంటి? పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు మంజూరు చేస్తే, వద్దంటూ లేఖ రాయడం ఏంటి? మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేసే స్కామ్‌లకు ఆలోచన చేయడం ఏంటి?

కోవిడ్‌లాంటి సంక్షోభం ఉన్నా వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం రూ.2403 కోట్లు ఖర్చుచేసి, ఐదు కాలేజీల్లో క్లాసులు మొదలుపెట్టి, మరో ఐదు కాలేజీలను ఈ ఏడాది నుంచే బోధనకు సిద్ధంచేశాం. మీ ప్రభుత్వం కూడా క్రమంగా ఖర్చుచేసుకుంటూవెళ్తే మిగిలిన కాలేజీలు కూడా అందుబాటులోకి వస్తాయన్నది వాస్తవం కాదా? ఇది చేయకుండా భారం అంటూ చేతులు దులిపేసుకుని ప్రజారోగ్య సంస్థలను అమ్మేస్తారా? ప్రయివేటు మీద మీకు అంతమోజు ఎందుకు? ప్రభుత్వ సంస్థలంటే అంత అసహ్యం ఎందుకు?

కొత్త మెడికల్ కాలేజీల నిర్వహణలో ఇబ్బందులు రాకూడదు, అదే సమయంలో పేద విద్యార్థులకు నష్టంరాకూడదన్న విధానంలో మేం సీట్లను భర్తీ చేస్తే, ఎన్నికల్లో ఓట్లకోసం నానా రాద్ధాంతం చేశారు. అధికారంలోకి వస్తే మొత్తం సీట్లన్నీ ఫ్రీ అన్నారు. సీట్ల సంగతి దేవుడెరుగు.. ఇప్పుడు ఏకంగా కాలేజీలనే అమ్మేస్తున్నారు. ఇది ఏరుదాటాక తెప్పతగలేయడం కాదంటారా? మోసం చేయడమే మీ నైజమని మరోసారి బయటపడింది చంద్రబాబు గారూ.

పార్లమెంటు నియోజకవర్గానికో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉంటే, అది ఆ నియోజకవర్గంలో ఉన్న ఏరియా ఆస్పత్రులకు, సీహెచ్‌సీలకు, పీహెచ్‌సీలకు, విలేజ్ క్లినిక్స్‌కు మార్గదర్శిగా ఉంటుంది. సూపర్‌స్పెషాల్టీ సేవలు కూడా పేదలకు ఉచితంగా ఆ జిల్లాస్థాయిలోనే అక్కడే లభిస్తాయి.

అలాంటి కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే ముందుగా నష్టపోయేది పేద విద్యార్థులే కాదు, అక్కడి ప్రజలకు కూడా. వారికి నాణ్యమైన వైద్యం అందదు సరికదా, ప్రైవేటు ఆస్పత్రులకు పోటీ లోపించి వైద్యంకోసం వసూలుచేసే ఫీజులు ఆకాశాన్ని అంటుతాయి. ఎప్పుడైనా ప్రైవేటుకు గవర్నమెంటు పోటీగా ఉంటేనే, రేట్లు రీజనబుల్‌గా ఉంటాయి.

కాలేజీలను ప్రైవేటీకరించాలన్న మీ విధానం అందరినీ దెబ్బతీస్తుందన్న మాట వాస్తవం కాదా? అటు ప్రజలను, ఇటు పిల్లలను కోవిడ్‌లాంటి మహమ్మారి సమయంలో ఆదుకున్నది ప్రజారోగ్యరంగమే అని గుర్తించకపోతే ఎలా చంద్రబాబు గారూ?

ఇకనైనా కళ్లుతెరవండి చంద్రబాబుగారూ.. వెంటనే ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవడంతోపాటు, ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోండి. మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తిచేసి, పేదపిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురండి.

మీకు చేతనైనంత మీరు ఖర్చుచేస్తూ వెళ్లండి. మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తి చేస్తాం. అంతేకానీ ఇలా మెడికల్‌కాలేజీల ప్రయివేటుపరం మాటున స్కామ్‌లు చేయడం మానుకో చంద్రబాబూ! లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదని గుర్తించుకోండి.

# రజాకార్లందరూ ముస్లింలే..
# కానీ ముస్లింలందరూ రజాకార్లు కారు

- సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినమే
- ప్రజాపాలన పేరుతో ప్రజలను మాయచేయొద్దు
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్,మహానాడు:** సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినమే. కానీ, ప్రజాపాలన పేరుతో ప్రజలను మాయ చేయొద్దు. భారతదేశానికి ఆగస్టు 15 1947న స్వాతంత్ర్యం వస్తే తర్వాత 13 నెలల తర్వాత 1948 సెప్టెంబర్ 17న నిరంకుశ నిజాం పాలన అంతమై తెలంగాణ స్వేచ్ఛ పొందింది.తెలంగాణ రాష్ట్రం విముక్తి చెంది భారతదేశంలో విముక్తి పొందింది. నాటి పోరాటంలో అమరవీరులను స్మరించుకుని, భావి తరాలకు రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు నిర్ణయించుకున్నాయి.

తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని బిజెపి అనేక పోరాటాలు చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా విమోచన దినాన్ని నిర్వహించాలని కోరింది. అయితే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండుసార్లు సెప్టెంబరు 17ను "జాతీయ సమైక్యతా దినంగా" రెండు సంవత్సరాలు నిర్వహించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 17 సెప్టెంబరును 'ప్రజాపాలన దినోత్సవంగా' నిర్వహించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్ర ప్రభుత్వం "ప్రజాపాలన" అని ఉత్సవాలను నిర్వహించడం రాజ్యాంగబద్ధమైనది కాదని భావిస్తున్నాం. ఇప్పటికే మహారాష్ట్ర- కర్ణాటక మాదిరిగా అధికారికంగా విమోచన ఉత్సవాలను నిర్వహించాలి. నిజానికి 1948 సెప్టెంబరు 17 నాటికి ప్రజాపాలన లేదు. పోలీసు చర్య తరువాత, హైదరాబాదు సంస్థానం విమోచన పొందింది, భారతదేశంలో విలీనం అయింది.

1952లో బూర్గుల రామకృష్ణారావు ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రి అయినాకనే ప్రజాపాలన మొదలయింది. అయితే, తెలంగాణ విమోచనం కోసం జరిగిన పోరాటాలను తక్కువ చేసి చూపించి, పోటాపోటీగా ఒకదానికొకటి ప్రజలను మాయచేసేలా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వక్రభాష్యం చెబుతున్నాయి.

ఎంఐఎం పార్టీ భయపడి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ విమోచనంలో జరిగిన పోరాటాన్ని తక్కువచేసి చూపిస్తున్నాయి. రజాకార్ల అందరూ ముస్లింలే.. కాని, ముస్లింలందరూ రజాకార్లు కారు. ఇది గుర్తించుకోవాలి. సెప్టెంబరు 17ను ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినమే.. కానీ, ప్రజాపాలన పేరుతో ప్రజలను మాయచేయొద్దు.

నిరంకుశ నిజాం పాలనలో హిందూ మహిళలపై వివస్త్రలు చేసి బతుకమ్మ ఆడిన దుర్మార్గ చరిత్ర గుర్తుంచుకోవాలి. హిందువులను ఊచకోత కోశారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాపోరాటాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ తప్పుదోవ పట్టించి, మరోసారి మోసం చేయడం సరికాదు.

కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబరు 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించినట్లుగానే, తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవంగా నిర్వహించాలి. హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషి చేసిన సర్దార్‌పటేల్‌కు నివాళులర్పించకపోవడం దౌర్భాగ్యం. దీన్ని విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి తగదు.

విమోచనం అంటే నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటం: రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి కనుమరుగైన



సెప్టెంబరు 17 విమోచన దినం చరిత్రను బిజెపి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మళ్లీ ప్రజలకు చరిత్ర గొప్పతనాన్ని, ప్రాధాన్యతను తెలియజేసేలా చాటిచెప్పారు. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవంపై ప్రతిపక్షంలో ఉన్నపుడు కేసీఆర్.. అధికారికంగా వేడుకలు జరపాలని డిమాండ్ చేసి, అధికారంలో వచ్చాక మాట మార్చారు.

తెలంగాణ రాష్ట్రంలో సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఎలా ప్రజాపాలన దినోత్సవమో అర్థరహితం. హైదరాబాద్ సంస్థానం విమోచనం అంటే నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటం. ప్రజాస్వామ్య పోరాటం, మెజారిటీ హిందువులపై చేసిన దమనకాండ చేసిన ఎంఐఎం పార్టీకి వ్యతిరేకంగా చేసిన ప్రజాపోరాటం.

ఆగస్టు 8, 1947న వరంగల్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేసినందుకు మొగలయ్యను రజాకార్లు దాడిచేసి చంపేశారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థాన ప్రజలు పోరాటాలు చేశారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి చేసిన పోరాటంతో, ఆపరేషన్ పోలోతో సెప్టెంబరు 17, 1948న తెలంగాణకు అసలైన స్వాతంత్ర్యం లభించింది.

**చరిత్రహీనులవుతారు:**
**ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్**

చరిత్రను విస్మరించినా, చరిత్రను పట్టించుకోపోయినా వారు చరిత్రహీనులవుతారు. కాంగ్రెస్ పార్టీ కూడా చరిత్రను కనుమరుగు చేస్తూ చరిత్రహీనంగా వ్యవహరిస్తోంది. సెప్టెంబరు 17 విమోచన దినోత్సవానికి సంబంధించి అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ముందు జాతీయ జెండా ఎగురవేయాలని భారత ప్రభుత్వం పిలుపునిచ్చింది.

తెలంగాణ ప్రజలందరికీ బిజెపి ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గత మూడేళ్లుగా అధికారిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకలకు కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరవుతున్నారు.

# మెరుగైన రహదారులు నిర్మిస్తాం...

- ప్రజల సౌకర్యార్థం మరిన్ని ఆర్టీసీ బస్సులు ఎలక్ట్రికల్ బస్సులు
- ప్రజా సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ముఖ్య లక్ష్యం
- రవాణా శాఖ యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి.

**ధర్మవరం,మహానాడు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెరుగైన రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర ప్రజల సౌకర్యం మరిన్ని ఆర్టీసీ బస్సులతో పాటు ఎలక్ట్రికల్ బస్సులు కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని, ప్రజా సంక్షేమమే ఎన్ డి ఏ ప్రభుత్వము యొక్క ముఖ్య లక్ష్యము అని రవాణా శాఖ యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో ఆరు నూతన బస్సులను వారు పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసే ప్రారంభించారు.





అనంతరం మంత్రులు మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని విలీనం చేశారే కానీ సమస్యలు పరిష్కరించకపోవడం వలన ఆర్టీసీ ఉద్యోగుల యొక్క భద్రత జీవన విధానం కుంటూ పడిందని వారు మండిపడ్డారు. వైయస్సార్ పార్టీ కార్యాలయాల కోసం ఆర్టీసీ స్థలాలను కూడా తాకట్టు పెట్టడం జరిగిందని వారు గుర్తు చేశారు.

ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన 90 రోజులకే ప్రతిరోజు రాష్ట్రంలో మూడు నూతన బస్సులను నడుపుతున్నామని, వచ్చే ఐదు సంవత్సరాలలో ఐదువేల నూతన బస్సులను తెప్పించేందుకు ముఖ్యమంత్రితో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే 1400 బస్సులకు గాను 600 బస్సులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో బస్సులు నడుస్తున్నాయని తెలిపారు.

గత వైయస్సార్ ప్రభుత్వంలో జాతీయ రహదారులు కేంద్ర ప్రభుత్వం అనుమతించినప్పటికీ, వైయస్సార్ ప్రభుత్వం భూమి సేకరించకపోవడం వల్ల నేడు రహదారులు నిర్మించలేకపోయామని తెలిపారు.

అనంతరం నూతన బస్సులో వారు కొద్దిసేపు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా అధికారి మధుసూదన్, బిజెపి నాయకులు దూల రాజారెడ్డి, డి .చెర్లోపల్లి నారాయణ స్వామి, ముదిగుబ్బా ఎంపీపీ ఆదినారాయణ, మంత్రి కార్యాలయం ఇన్చార్జ్ హరీష్ బాబు, జింక రామాంజనేయులు, డిపో మేనేజర్లు సత్యనారాయణ , షేక్ ఇనాయతుల్లా, సూపర్వైజర్లు సికిందర్, శ్రీరాములు డిపో ఉద్యోగులు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున డిఎస్పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఊపందుకున్న ఆక్రమణల తొలగింపు!

## - వెల్లువెత్తుతున్న అభినందనలు

**గుంటూరు, మహానాడు:** నగరంలో డ్రైన్ల ఆక్రమణల తొలగింపు వేగంగా జరుగుతోందని, దశలవారీగా వీటిని తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్ లో ఆదివారం పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓల్డ్ క్లబ్ రోడ్ లో కొన్ని హాస్పిటల్స్ డ్రైన్ పై స్లాబ్ లు వేసి జనరేటర్లు, కార్ పార్కింగ్ లకు వినియోగిస్తున్నారని, దీనివలన డ్రైన్ లో ఉన్న సిల్ట్ తీయడానికి వీలు లేకుండా పోతుందన్నారు. వర్షాల వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలి కాబట్టి వాటిని కూడా తొలగించాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ మీద ఉన్న ప్రతి ఆక్రమణ తొలగించాల్సిందేనన్నారు. ఆక్రమణల తొలగింపునకు విధులు కేటాయించిన ప్రతి ఒక్క అధికారి, కార్యదర్శి పూర్తి స్థాయిలో విధుల్లో ఉండాలన్నారు. ఆక్రమణల తొలగింపు వ్యర్థాలను



ఎప్పటికప్పుడు నగరంలోని జిఎంసికి చెందిన లో లెవల్ స్థలాల్లో మెరక చేయడానికి తరలించాలన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ పి.సమత, తూర్పు ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, టిపిఎస్ రసూల్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సత్యకుమార్ సవాల్‌కు సిద్ధం

- చర్చకు ఎక్కడైనా రెడీ
- మెడికల్ సీట్లు వద్దని చెప్పడం దుర్మార్గం దారుణం
- వైద్య విద్య కోరే పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు
- మెడికల్ సీట్ల వ్యవహారంపై మంత్రి సత్యకుమార్‌కు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్

**నరసరావుపేట,మహానాడు:** రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టి, ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లారని, వాటిలో 5 కాలేజీలు గత విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడించారు.

అన్నీ సవ్యంగా జరిగి ఉంటే, ఈ ఏడాది మరో 5 కాలేజీలు కూడా మొదలై ఉండేవని తెలిపారు. కానీ, సీఎం చంద్రబాబు నిర్వాకం వల్ల, అవి ప్రారంభం కాకపోగా.. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పులివెందుల మెడికల్ కాలేజీకి ఇచ్చిన 50 మెడికల్ సీట్లు కూడా పోయాయని ఆక్షేపించారు.

ఆ సీట్లు వద్దంటూ ఎన్ఎంసీకి ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమని ఆగ్రహించారు. అసలు కొత్తగా మెడికల్ సీట్లు వస్తే మీకు (ప్రభుత్వానికి) వచ్చిన నష్టమేమిటని.. ఒక డాక్టర్‌గా అడుగుతున్నానన్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. 40 ఏళ్ళుగా ఏపీలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కూడా ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు.

వైద్య విద్య ఎంత కష్టమైందో.. మెడిసిన్ సీటు సంపాదించడం కూడా ఎంత ఇబ్బందో అందరికీ తెలిసిందేనన్న నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే.. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ మాటలు విస్మయం కలిగించాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జగన్, వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడమే కాక.. పోస్టులన్నీ భర్తీ చేశారని స్పష్టం చేశారు.





అందుకే.. మంత్రి సత్యకుమార్ సవాల్ స్వీకరిస్తున్నానని, ఎక్కడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య ఆరోగ్య రంగంలో ఎంత అభివృద్ధి జరిగింది?. ఈ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమని తేల్చి చెప్పారు.

గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సిబ్బంది ధర్నాతో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు ఆగిపోయాయని, స్పెషలిస్ట్ వైద్యసేవలూ నిల్చిపోయాయని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వివరించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

4

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024

# విపత్తు నష్టం 10,300 కోట్లు

- ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో భారీ నష్టం
- గండ్లు పడిన చెరువుల పునరుద్ధరణకు నిధులు మంజూరు
- కోదాడ, హుజుర్నగర్ నియోజకవర్గాలలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన
- భారీ వర్షాలతో గండ్లు పడిన సాగర్ ఎడమ కాలువకు జరుగుతున్న మరమ్మతుల పరిశీలన

**కోదాడ,మహానాడు:**

ఇది ప్రకృతి వైపరీత్యం. ఈ విపత్తుకు రాష్ట్రానికి జరిగిన నష్టం 10,300 కోట్లు. కేంద్ర ప్రభుత్వ సహాయం కోరినాము. జరిగిన నష్టం వివరాలను కేంద్రానికి నివేదించినాం. కేంద్రం సహాయం కోసం ఎదురు చూడకుండా నష్ట నివారణ చర్యలు చేపట్టినాం.

విపత్తు సంభవించిన రోజు నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో సహా అందరం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. భారీ నుండి అతి భారీగా కురిసిన వర్షాలతో ఖమ్మం,సూర్యాపేట జిల్లాలోని కోదాడ హుజూర్నగర్ ప్రాంతాలలో భారీ నష్టం సంభవించింది.

కాగిత రామచంద్రాపురం వద్ద గండి పడిన సాగర్ ఎడమ కాలువాను నెల రోజుల్లో పునరుద్దరిస్తాం. రేయింబవళ్లు పని చేసేందుకు ఏజెన్సీ ముందుకు వచ్చింది. ఇది అత్యయక పరిస్థితిగా గుర్తించినందుకే పనులు వేగవంతం చేస్తున్నాం. రాత్రుళ్ళు పనులకు ఆటంకం ఏర్పడకుండా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశాం. సంఘటన జరిగాక ఇక్కడికి నేను రావడం ఇది రెండోసారి. వారంలోపు ఈ కాలువలో నీళ్లు పారుతాయి.

రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో పని చేస్తుంది. రైతాంగం నష్టపోకూడదు అన్నదే ప్రభుత్వ సంకల్పం. పంట నష్టం జరగకూడదన్న భావం తోటే స్వయంగా పరిశీలన. రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల చెరువులు కాలువలకు గండ్లు. కొన్ని చోట్ల పంప్ హౌజ్ లు ముంపునకు గురయ్యాయి. గండ్లు పడిన చెరువుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తాం. హుజుర్నగర్



నియోజకవర్గ పరిధిలో బురుగ్గడ్డ నల్లచెరువు,చౌటపల్లి చెరువు, నాగులచెరువులతో పాటు కోదాడ నియోజకవర్గంలోని నారాయణపురం చెరువులను పునరిద్దరిస్తాం.

కోదాడ నియోజకవర్గ పరిధిలోని ఆర్లగూడెం గ్రామములోని రెడ్లకుంట మేజర్, హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ మేజర్ కెనాల్‌ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తాం. వరదలతో నష్టపోయిన పంటలకు తగిన పరిహారం. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ళు నిర్మిస్తాం. వరదల్లో ప్రాణ నష్టం జరిగిన కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం మంజూరు చేస్తాం.

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పదవీ ప్రమాణ స్వీకార సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పిలుపు

**హైదరాబాద్,మహానాడు:**

పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న మహేష్ కుమార్ గౌడ్ ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్న. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాలు, రాహుల్ గాంధీ ఆలోచన, సోనియా గాంధీ ఆశీస్సులతో పిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ నియామకం చేసినందుకు ఏఐసిసికి కృతజ్ఞతలు.

ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను, లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తీసుకు వెళ్లే విధంగా పిసిసి నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కార్యక్రమం చేపట్టాలి.

10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ శ్రేణులు అనేక పోరాటాలు చేసి కేసులను, నిర్బంధాలను ఎదుర్కొని అవమానాలు భరించి, అచంచలమైన పట్టుదలతో పార్టీ జెండాను భుజాన మోసుకొని అధికారంలోకి తీసుకురావడానికి చేసిన కృషికి కృతజ్ఞతలు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను, ఇంటింటికీ తీసుకువెళ్లి ఓట్లు అడిగి పార్టీని గెలిపించారు. కాంగ్రెస్ శ్రేణులు తలెత్తుకునే విధంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నది. శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, అసెంబ్లీ ప్రాంగణంలో మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు పథకాన్ని ప్రారంభించాము.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్న డబ్బులను నెలకు 400 కోట్ల రూపాయలను, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తున్నది.ఆరు గ్యారెంటీల హామీల అమలులో భాగంగా అర్హులైన ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందించే గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించాం.మహిళలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు సబ్సిడీపై అందిస్తున్నాం.

ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల



నిర్మాణం చేపట్టబోతున్నాం. ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు లబ్ధిదారులకు ఇవ్వబోతున్నది. గత పాలకుల విధానవల్ల కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ప్రతినెల 1వ తేదీన ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నాం.

దేశ చరిత్రలో 15 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయలు, రైతు రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిది. ప్రభుత్వ లక్ష్యాలను కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలి. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడినది ప్రజా ప్రభుత్వం. ప్రజల కోసం సంపద సృష్టిస్తాం. సృష్టించిన సంపదను ప్రజలకే పంచుతాం

కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తను తప్పనిసరిగా పార్టీ గుర్తిస్తుంది, గౌరవిస్తుంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులను పార్టీ గుర్తించి, కార్పొరేషన్ చైర్మన్ పదవులను కట్టబెట్టి గౌరవించింది

ప్రజల కోసం అంకితభావంతో పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే కాంగ్రెస్ నాయకులను కచ్చితంగా పార్టీ అధిష్టానం గుర్తిస్తుంది అనడానికి.. ఎన్ఎస్‌యుఐ యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించి, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్ ఇందుకు నిదర్శనం.

# వరద బాధితులకు సాయం

**గుంటూరు, మహానాడు:**

స్థానిక కన్నావారి తోటలోని గుంటూరు తెలుగు బాప్టిస్ట సంఘం(మెయిన్ సర్వీస్) సభ్యులు విజయవాడ సింగ్ నగర్ లో వరద ప్రభావితులకు అందించనున్న 400 నిత్యావసర సరుకుల కిట్స్ వాహనాన్ని ఆదివారం నగర కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కిట్స్ అందించిన గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యులకు నగరపాలక సంస్థ తరుపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు మున్ముందు కూడా సంఘం చొరవ చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు.



# టీడీపీలో చేరికకు పవన్‌కు ఇదే సరైన సమయం!

## - చిరులా 'వన్ టైమ్ వండర్ 'కాకూడదనుకుంటే ...

అవును. తెలుగుదేశం పార్టీలో జనసేనను విలీనం చేయడానికి – రాజకీయంగా కూడా – పవన్ కళ్యాణ్‌కు ఇదే తగిన సమయం .

పవన్ కళ్యాణ్ ....రాజకీయంగా తన సత్తా చూపించారు . కీలకమైన సందర్భాలలో అనూహ్యమైన సంయనం పాటించారు. తన రాజకీయ ప్రయాణాన్ని గతుకులు – గుంటల రోడ్డు పట్టించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన చేగొండి హరేరామ జోగయ్య లాంటి వారిని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారు. జనసేన హార్డ్ కోర్ జనం ఎప్పుడు ఏమి మాట్టాడాలో.... ఏమి మాట్లాడ కూడదో దిశా నిర్దేశం చేశారు. తన ఉనికిని, రాజకీయ ప్రయాణాన్ని పట్టించుకోక తప్పని పరిస్థితులను తెలుగుదేశం పార్టీ కి కల్పించారు .

పవన్ కళ్యాణ్ ' ఏమిటో ఎవరికి తెలిసినా ...తెలియక పోయినా .... వైసీపీ వారికి తెలిసింది. పై నుంచి కింది వరకు నాయకులు – పవన్ కళ్యాణ్ టీడీపీ వైపుకు వెళ్లకుండా చూడడానికి విశ్వప్రయత్నం చేశారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి కాపుల్ని తాకట్టు పెడుతున్నారని అన్నారు. ప్యాకేజీ స్టార్ తప్ప, పవర్ స్టార్ కాదు అన్నారు. ఏటా కార్లు మార్చినట్టు భార్యల్ని పవన్ కళ్యాణ్ మార్చుతున్నారని 'ఆ ' ఏక పత్నీవ్రతులు,ఏక పత్నీవృత సలహా దారులు అన్నారు .

ఈ విమర్శల జడివానను పరిశీలించిన పవన్‌కు, తాను వెడుతున్న మార్గం సరియైనదే అన్న నమ్మకం మరింతగా బలపడింది. లేకపోతే, స్టువర్టుపురం గ్యాంగులు లాగూలు ఎందుకు తడుపేసుకుంటాయి !?

వారి విమర్శలు పెరిగేకొద్దీ పవన్ కళ్యాన్‌లో సహనం పెరుగుతూ వచ్చింది.

2014 ఎన్నికలకు ముందు జనసేన పార్టీ ప్రకటన చేస్తే బీ 2024 ఎన్నికల ముందు నాటి వరకు ....పవన్ కళ్యాణ్‌కు రాజకీయంగా దారీ...తెన్నూ కనపడలేదు .

రాజకీయాలలో గోచీ ...మొలతాడు లేనివాళ్ళు శాసనసభ, పార్లమెంట్‌లో అడుగుపెడుతుంటే లక్షలాది మంది అభిమానులు ,వేలాదిమంది అనుచరులు కలిగిన తాను కనీసం శాసనసభ మొహం కూడా చూడలేకపోవడం పవన్ కల్యాణ్ ను అమితంగా వేదనకు గురిచేసింది .

2024 ఎన్నికల్లో తాను అసెంబ్లీ ప్రవేశం చేయడం మాత్రమే గాక బీ తన పార్టీ నుంచి కనీసం ఓ పాతిక మంది నాయకులను "అసెంబ్లీ ప్రవేశం " చేయించాలని లక్ష్యంగా పెట్టుకుని , ఓపికగా ....సహనంగా ... ధృడ దీక్షతో ....సివిల్స్ పరీక్షలకు వెళ్ళే అభ్యర్థులు ఏకాగ్రత తో కృషి చేసినట్టుగా.... లక్ష్యం దిశగా ఆయన ఒక్కోడుగు ముందుకు వేసుకుంటూ వెళ్లారు .

తెలుగు దేశంతో కలిసి , జగన్ వ్యతిరేక ఓటును చీలనివ్వబోను అంటూ పవన్ కళ్యాణ్ ఎన్ని భీషణ ప్రతిజ్ఞలు చేసినప్పటికీ తెలుగు దేశం వైపు నుంచి స్పందన లేదు .

ఔను....కాదు.... అని స్పందించిన టీడీపీ నాయకుడు కనిపించలేదు. మరోపక్కన...."టీడీపీతో ఎందుకు ? మనకే బోలెడన్ని ఓట్లు ఉంటే...." అంటూ కోవర్టు బ్యాండ్ మేళం హోరెత్తుతోంది. అయినప్పటికీ,పవన్ కళ్యాణ్ తొణకలేదు. బెణక లేదు.

జగన్ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్న తన వ్యూహంపై టీడీపీ స్పందించే 'శుభ సమయం ' కోసం పవన్ కళ్యాణ్ ఓపికగా వేచివున్నారు .

' ఆ ' సమయం ....గత ఏడాది యీ నెలలోనే వచ్చింది.

2023 సెప్టెంబర్ 9 న అప్పటి ముఖ్యమంత్రి జగన్ , చంద్రబాబు ను "ఎత్తించి "(అంటే అరెస్టు చేయించి అని అర్థం.అది ఫాక్షనిస్ట్ భాష లే )...రాజమండ్రి సెంట్రల్ జైలు కు పంపిం చారు .

ఈ హఠాత్పరిణామానికి, టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ స్థాణువుల్లా బిగుసుకు పోయాయి. జగనోలీసులు (జగన్



పోలీసులు అని అర్థం. సమాసం తప్పే గానీ , సర్దుకు పోదాం) పూర్తిగా బరి తెగించి ఉన్నారు. ఈ "పరమాక్రమ అరెస్టు" ను ఎవరు ఖండిస్తే , వారిని " ఎత్తేయ"డానికి సిద్ధంగా ఉన్నారు .తమ "వెంట్రుక పీకేవాడు ఎవడన్న....జగనన్న ఉండగా..." అనే నూరు శాతం ధీమాలో వారు ఉన్నారు.

ఆ "స్మశాన నిశ్శబ్ద" వాతావరణ పరిస్థితుల్లో ....పవన్ కళ్యాణ్ ఏకాయెకిని రాజమండ్రి వెళ్లారు . అక్కడే ఉన్న నారా లోకేష్ ను , నందమూరి బాలకృష్ణ ను ఓదార్చారు . ఆ క్షణం నుంచే జనసేన... తెలుగుదేశం తో కలిసి అడుగులో అడుగు వేస్తుందని ప్రకటించారు . లోకేష్ , బాలకృష్ణ ఈ ప్రకటపై ఏమీ కామెంట్ చేయలేదు .

జైలు లోపలకు పవన్ కళ్యాణ్ వెళ్లి , చంద్రబాబు ను కలిసి , " నేనున్నాను . మీ వెంట నడుస్తాను ." అని హామీ ఇచ్చారు .

పవన్ హామీకి చంద్రబాబు పరవశించి పోయారు .

తెలుగు రాజకీయాలు అక్కడినుంచి కీలక మలుపు తిరిగాయి. టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ తేరుకున్న పరిస్థితులు కనిపించాయి .

చంద్రబాబు జైలు నుంచి బెయిల్ పై విడుదల సందర్భంగా, ఈ "మారిన ' రాజకీయ వాతావరణం కళ్ళకు కట్టినట్టు కనిపించింది .

రాజమండ్రి జైలు నుంచి విజయవాడ – ఉండవల్లి లోని తన నివాసానికి చేరుకోడానికి , చంద్రబాబుకు దాదాపు 14 గంటల సమయం పట్టింది . మేటర్ అప్పుడే డిసైడ్ ఐపోయింది .

అయితే , జనసేన శ్రేణుల్లో కొత్త డిమాండ్లు పుట్టుకు వచ్చాయి .

తమ వల్లే టీడీపీ కి ఇంత జోష్ వచ్చిందని , సగం సీట్లు తమకు ఇవ్వాలని కొందరు అందుకుంటే సీఎం పదవి తమకు ఇవ్వాలని కొందరు హంగామా చేశారు.

పవన్ కళ్యాణ్ తొణకలేదు. చాలా స్పష్టతతో ముందుకు వెళ్లారు .

చంద్రబాబు నాయుడుతో "వ్యక్తిగత" స్థాయిలో అద్భుతమైన అవగాహన ఏర్పాటు చేసుకున్నారు.

ఎన్ని సీట్లకు జనసేన పోటీ చేయబోతున్నదనే విషయం అత్యంత గోప్యంగా ఉంచారు. కనీసం పోటీ చేసే స్థానాల పేర్లు కూడా బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు .

వీళ్ళిద్దరూ ఎక్కడ టై అప్ అయిపోతారో అని మరోపక్క చేగొండి హరిరామజోగయ్యలు విపరీతం గా వర్రీ అయిపోతూ....పొద్దున్నా, మధ్యాహ్నం, సాయంత్రం ప్రెస్ మీట్లు . మీడియాలో ఓ వర్గం ఈ కోవర్టు బ్యాచ్ కి ఊదర. వీర పబ్లిసిటీలు .

అయినప్పటికీ , పవన్ కళ్యాణ్ ఊహాతీత సంయమనంతో వ్యవహరించారు . ఎక్కడికక్కడ తగ్గారు .

బీజేపీ తమతో లేకపోతే ఎంత ప్రమాదమో ముందుగానే అంచనా వేసి ఒకటికి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి , దానిని కూడా తమ ఆవరణ లోకి లాక్కొచ్చి, గుంజకు కట్టేసి , దానికి వేయాల్సిన మేత వేయించారు. ఇందుకోసం, తనకు కేటాయించిన సీట్లను కూడా వదిలేసుకున్నారు .

తాను పోటీ చేయాల్సిన సీట్ల సంఖ్యను తగ్గించుకోవడం పై జనసేన లో వ్యక్తమైన ముక్కులు ....,మూలుగులపై పవన్ కళ్యాణ్ నేరుగానే స్పందించారు .

" ఎన్ని సీట్లకు పోటీ చేశామన్నది కాదు కొశ్శను.ఎన్ని గెలిచామన్నది పాయింటు " అని అసహన వాదుల నోళ్ళు మూయించారు .

చివరకు 21 అసెంబ్లీ , రెండు లోక్సభ స్థానాలకు పోటీ చేసి బీ అన్నీ గెలిచారు .

ఆయన లక్ష్యం నెరవేరింది . ఆంధ్రప్రదేశ్ శాసనసభ లోకి కుడి కాలు పెట్టారు . తన పార్టీ వారు మరో ఇరవై మందితో సభాప్రవేశం చేయించారు .ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తో సమాన స్థాయి, హోదా అన్నంతగా ప్రభుత్వం లో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి బీ తెలుగు రాజకీయాలలో చరిత్ర సృష్టించారు .

అక్కడితో ఆయన ఆగలేదు. చంద్రబాబు నాయుడి పట్ల పవన్ కళ్యాణ్ అనూహ్యమైన విధేయత , గౌరవం ,వినయం ప్రదర్శిస్తూ "కూటమి ధర్మం"కు ఒక సరికొత్త నిర్వచనం చెబుతున్నారు .

పార్టీ స్థాపించిన పదేళ్ల తరువాత ఇప్పుడు... పూర్తి స్థాయి రాజకీయ నేతగా ...ఆయన తెలుగు ప్రజలకు దర్శనమిస్తున్నారు .

ఒక ముక్కలో చెప్పాలి అంటే ....చంద్రబాబు నాయుడు తర్ఫీదులో ...శిక్షణలో .... పవన్ కళ్యాణ్ ...ఒక పూర్తిస్థాయి నేతగా తనను తాను మలుచుకున్నారు.

ఇప్పటి వరకు ఆయన చేసిన రాజకీయ ప్రయాణం ఒక ఎత్తు. ఇక ముందు చేయబోయే ప్రయాణం ఒక ఎత్తు.

రాజకీయం గా ఒక బలమైన " లాంచింగ్ ప్యాడ్" వద్దకు ఆయన చేరారు. ఇప్పుడు ఆ ప్రయాణాన్ని కొనసాగించడానికి , జనసేన ను ఆయన తెలుగుదేశం లో బేషరతుగా విలీనం చేయాలి . చంద్రబాబు చేతులను మరింత బలోపేతం చేయాలి . రాజకీయం గా మరింతగా తెలుగువారికి దగ్గరవ్వాలి .

ఎందుకంటే బీసంఘ వ్యతిరేక శక్తులపై ఏకోన్ముఖ రాజకీయ పోరాటం జరగాలి .

ఈ శక్తులు చాలా చురుకుగా కదులుతున్నాయి. వాటి చేతుల్లో ' ధన వాములు ' (అంటే గడ్డి వాముల్లాగా ) ఉన్నాయి. బ్యాండ్ మేళాలు ఉన్నాయి. నిజమా ...అసత్యమా అనే పట్టింపు లేదు . బకెట్లు కొద్దీ కుమ్మరించడమే వీటి పని .అన్నిటికీ రేట్లు ఉంటాయి.

ఈ శక్తులు ఏ కార్యక్రమానికి వచ్చి.... ఎన్నిసార్లు చప్పట్లు కొట్టాలో ముందే డిసైడ్ అయిపోతుంది అంటారు , విషయాలు తెలిసిన వారు .

ఏది , ఎప్పుడు , ఎక్కడ ,ఎలా చేయాలో ఈ శక్తులకు అద్భుతమైన స్పష్టత ఉంది .

ఈ శక్తులను తట్టుకుంటూ , ప్రజల అంచనాలను అందుకుంటూ పాలన సాగించడం చిన్న విషయం కాదు .


చంద్రబాబు ఇప్పటికే ఒత్తిడి లో ఉన్న భావనలు రాష్ట్రం లో వ్యాపిస్తున్నాయి . చాలా నిర్ణయాలు ....త్వర త్వరగా, ధృడంగా తీసుకోలేకపోతున్నారని కూడా పరిశీలకులు భావిస్తున్నారు .

ఆయన ' పుట్టు వ్యతిరేకుల'కు పాలనాంశాలు ముఖ్యం కాదు . రాజకీయాలు ముఖ్యం . చంద్రబాబును అల్లరి చేయడం ముఖ్యం . ఇప్పటికే చురుకుగా వ్యవహరిస్తున్న ఈ శక్తులు ముందు ముందు ఎలా వ్యవహరిస్తాయో అంచనా వేయడం కష్టం కాదు .

అందుకే , పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన అభిమానులు , ఓటు బ్యాంక్ కూడా టీడీపీ లో విలీనం అవ్వాలి. తెలుగు దేశం పార్టీలో భాగం అవ్వాలి.

చంద్రబాబు నాయుడు పాలనపై దృష్టిపెడితే పవన్ కళ్యాణ్....రాజకీయాలపై దృష్టి పెట్టాలి . సమాజం నుంచి కలుషిత రాజకీయాన్ని తుడిచిపెట్టడానికి ఏమి చేయాలో ....అది చేయాలి. ఆయన, ఆయన పరివారం టీడీపీలో చేరితేనే ఇది సాధ్యం అవుతుంది. రాష్ట్ర క్షేమం దృష్ట్యా....చంద్రబాబు నాయుడు – పవన్ కళ్యాణ్ మధ్య ఈక్వేషన్ మరో మెట్టు ఎక్కాలి. ప్రజలు స్వాగతిస్తారు . పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం సజావుగా సాగుతుంది.భావి తరాలకు మేలు జరుగుతుంది.

పవన్ కళ్యాణ్ కూడా, చిరంజీవి లాగా " వన్ టైమ్ వండర్"గా మిగిలిపోగూడదనేదే ఆకాంక్ష .



- భోగాది వేంకట రాయుడు

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com


డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024

## కూలుతున్న 'గ్రేస్' లేని గోడలు!

**గుంటూరు, మహానాడు:** గుంటూరు గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్స్‌కు సంబంధించిన గోడలు కూలిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని... అయినా నిమ్మకి నీరెత్తినట్టు కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. ఇటువంటి పనులపై ముఖ్యంగా కార్పొరేషన్ అధికారులు ఎటువంటి పర్యవేక్షణ చేపట్టడం లేదని విమర్శించారు. నియమ నిబంధనలను పాటించకపోవడం, కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, అలసత్వం వల్ల బిల్డింగులు కూలుతున్నాయని ఆయన ఆరోపించారు.

ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని, మున్ముందు మరికొన్ని ఆధారాలతో అక్కడ జరుగుతున్న అక్రమాలు ప్రజల ముందు పెడతానని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





## 17 నుంచి బీజేపీ సేవా కార్యక్రమాలు

● మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి నాగభూషణం

**విజయవాడ, మహానాడు:**
భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఈ నెల 17వ తేదీ నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు ఆ పార్టీ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు అన్ని జిల్లాల్లో రక్తదాన శిబిరాలు యువ మోర్చా ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయని 19తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 18 నంచి 24 వరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిసరాల శు భ్రత, 23 ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభం సందర్భంగా 60 ఏళ్ళు పైబడిన వయసుగల మహిళలందరికీ ఉచిత్ ఆరోగ్య శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు అక్టోబర్ రెండో తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

## గణేష్ లడ్డుని వేలం పాట పాడిన మండల ముస్లిం యువకుడు

**తాళ్లూరు, మహానాడు:**
తాళ్లూరు మండలం బొద్దికూర పాడు గ్రామం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నిమజ్జనం సందర్భంగా వినాయక మండపం వద్ద పూజలు అందు కున్న 50 కేజీల లడ్డు ప్రసాదాన్ని ముస్లిం యువకుడు షేక్ కమాల్ వలి వేలం పాటలో 26 వేల రూపాయలకు దక్కించుకున్నాడు. ముస్లిం యువకుడు గణేష్ లడ్డు దక్కించుకోవడం పట్ల హిందూ, ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తూ, మా గ్రామం మతసామ రస్యానికి ప్రతీక అంటూ బొద్దికూరుపాడు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## జగన్ జైలు పక్షి!

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

**గుంటూరు, మహానాడు:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద బాధిత ప్రాంతాల్లో ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలు పక్షిలా సమాజానికి ఇబ్బందికరంగా వ్యవహరించే వ్యక్తులను పరామర్శించడానికి జైలుకు వెళ్ళడం వారి విధానాన్ని చాటుతోందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్





అన్నారు. కొల్లిపర మండలం బొమ్మువాని పాలెం గ్రామంలో వరద బాధితులకు హార్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి కత్తెర సురేష్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ హనీ క్రిస్టినా అందించే నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ఆలపాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్వెస్ట్ ఇండియా సంస్థ నిర్ణయం అభినందనీయమన్నారు. సాయం చేసేందుకు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ స్పందిస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికీ తమ నైజాన్ని చాటుకుంటున్నారని ఆరోపించారు.

## డిప్యూటీ సీఎం భట్టికి అరుదైన గౌరవం

నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం

**హైదరాబాద్, మహానాడు:**
ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు.. మెక్సికో దేశంలో న్యూవోలియోన్ లోని మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






మల్లును నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ 200 వ వేడుకలో నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించు కోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో తెలిపారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు.



## వరద బాధితులకు నిత్యావసర సరుకులు

● వాహనాలకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మహానాడు:**
విజయవాడ వరద బాధితుల సహాయార్థం గుంటూరు బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద "అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్, వెంకటేశ్వర స్వామి గుడి వాకర్స్ అసోసియేషన్" ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల వాహనాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... వరద వలన విజయవాడ వాసులు అనేక కష్టాలు పాలయ్యారని, వీరికి ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి తమ దాతృత్వం ను చాటుకుంటున్నారని, ఇదే స్ఫూర్తిగా అనేక మంది ముందుకు వచ్చి సేవాస్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## వినాయక నిమజ్జనంలో ఘర్షణ

● ముగ్గురికి గాయాలు

**మచిలీపట్నం, మహానాడు:**
స్థానిక ఎనిమిదో డివిజన్ అంజమ్మ కాలనీలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో విగ్రహం నిమజ్జనం కార్యక్రమంలో ఘర్షణ చెల రేగింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఊరేగింపులో పాల్గొన్న ఐదుగురు వ్యక్తులు రఫీ ఇంటిపై రాళ్లు విసిరి, దాడి చేశారు. రఫీ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరికి కూడా గాయాలు అయినట్టు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు. ఫిర్యాదు ఇచ్చి ఇంటికి వెళ్ళగానే మాపై కంప్లైంట్ ఇస్తావా? ఏంటి నీకు అంత ధైర్యం? అని రఫీ తల పగలగొట్టారు. వెంటనే రఫీ రోడ్డుపైకి పరిగెత్తగా ఎస్సై వచ్చి రఫీని కాపాడి దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులను వెంటనే పట్టుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. రఫీని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 'అత్యాచార నిందితులకు కఠినంగా శిక్షించాలి'

**మచిలీపట్నం, మహానాడు:**
స్థానిక గుమస్తాల కాలనీలో నివాసముంటున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, మచిలీపట్నం నగర కార్యదర్శి కొడాలి సుజాత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంతో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. బాలిక కు సంబంధించి తల్లి పుట్టి అంధురాలు, కుటుంబానికి ఎటువంటి పోషణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకుని కుటుంబానికి ఆర్థిక సహాయం




చేయాలని కోరారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు పరస లక్ష్మీ మాట్లాడుతూ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నింది తుడు గంజాయి అమ్ముతుంటాడని, నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఐద్వా పట్టణ కమిటీ సభ్యురాలు బూర భవాని మాట్లాడుతూ ఐద్వా సంఘంగా ఆ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామన్నారు.



వినాయక నిమజ్జనం సందర్భంగా మోతడక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్.



పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం గురజాల టౌన్‌లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వినాయక చవితి సందర్భంగా గురజాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల్లో గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపం ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ(టీడీపీ) యాప్ ద్వారా పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు విస్తృత స్థాయిలో షేర్ చేసి ఉత్తమ పర్ఫామెన్స్ సాధించిన పార్టీ అభిమానులకు ప్రశంసా పత్రాలను అందజేసిన ఎంఎల్‌ఏ జి.వి ఆంజనేయులు. వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు మక్కిన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.




జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2కోట్లను విరాళంగా అందజేసిన సువెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో & చైర్మన్ వెంకట్ జాస్తి.



భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అయిన నేపథ్యంలో తెలుగు టెలివిజన్ డిజిటల్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యులు ఈటీవీ ప్రభాకర్, వినోద్ బాల, ప్రసాద్, తదితరలు ఉప ముఖ్యమంత్రిని కలిసి వరద బాధితుల కోసం రూ.5 లక్షల విరాళం చెక్కులను అందజేశారు. ఆపద కాలంలో దాతృత్వాన్ని చాటుకున్న ప్రొడ్యూసర్స్ అభినందనలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

## ఢిల్లీ సీఎం అతిషి?

**ఢిల్లీ,మహానాడు:**
ఆమ్ ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకమైన వ్యక్తి, కేబినెట్లో 11 మంత్రిత్వ శాఖలు ఉన్న మంత్రి అతిషి పేరును ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపు.. పార్టీ మేనిఫెస్టో రూపకల్పనలో అతిషి కీలకంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు కేజ్రీవాల్ ప్రకటించారు. రెండు రోజుల్లో ముఖ్య మంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తామని ఆయన పేర్కొన్నారు.



# గణనాథులకు ఎమ్మెల్యే విశేష పూజలు

**గుంటూరు, మహానాడు:**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు వినాయక మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు నియోజకవర్గంలోని మహర్షి దయానంద నగర్, సంపత్ నగర్, శ్రీనివాసరావు పేట, నాయీ బ్రహ్మణ కాలనీ, కల్యాణి నగర్, సాకేతపురం, నల్లచెరువు 15, 25 లైన్లు, బ్రాడిపేట 6/19, విద్యానగర్ 1,3వ లైన్లు, జే కే సి కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం వినాయక చవితి నవరాత్రులలో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలను ప్రారంభించారు.



6

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024



## వరదపై విష ప్రచారాలకు పాల్పడితే చర్య

- మంత్రి నారాయణ హెచ్చరిక

**విజయవాడ, మహానాడు:**
వరద ప్రభావిత ప్రాంతాల్లో మరోసారి మంత్రి నారాయణ పర్యటించారు. కండ్రికలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులతో పాటు స్వయంగా ఇళ్ళలోకి వెళ్లి





బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ఏమన్నారంటే.. విజయవాడలో పరిస్థితి మెరుగుపడింది. ఫైరింజన్లతో ఇళ్ళను శుభ్రం చేయిస్తున్నాం. మళ్ళీ వరద అంటూ తప్పుడు ప్రచారం వైసీపీ కుట్రగా భావిస్తున్నాం. దీనిపై డీజీపీకి ఫిర్యాదు చేశాం. చంద్రబాబు పాలన దక్షత చూసి ఓర్వలేక వైసీపీ తప్పుడు ప్రచారం. విష ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు.

## వరద బాధితుల కోసం
# దివీస్ భారీ విరాళం

- మంత్రి లోకేష్‌కు రూ.5 కోట్ల చెక్కు అందజేత
- మొత్తం సాయం రూ.9.8 కోట్లు

**అమరావతి, మహానాడు:**
కృష్ణా నదికి కనీవినీ ఎరుగని రీతిలో సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న బాధితులను ఆదుకునేందుకు దివీస్ సంస్థ భారీ విరాళంతో ముందుకు వచ్చింది. దివీస్ సీఈవో దివి కిరణ్ ఆదివారం హైదరాబాదులో మంత్రి నారా లోకేష్ ను కలిసి ఐదు కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. ఈనెల 1 నుంచి 8వ వరకు వరద బాధితులకు ఆహారాన్ని అందజేసేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ కు మరో రూ. 4.8 కోట్లను దివీస్ సంస్థ అందజేసింది. మొత్తంగా రాష్ట్రంలో వరద



బాధితుల కోసం 9.8 కోట్ల రూపాయల విరాళాన్ని అందించిన దివీస్ సంస్థను మంత్రి నారా లోకేష్ అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతో వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న దాతలకు లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీ పాలనలో ఖజానా గుల్ల!

- గాంధీ విగ్రహం ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, మహానాడు:** పల్నాడు జిల్లా, గురజాల పట్టణంలోగల గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన భారత జాతిపిత మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతి అనే ఆయుధంతో 200 ఏళ్ళ రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని నేల కూల్చి



భారతదేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని తెలిపారు. ఈరోజు గురజాలపట్టణంలో గాంధీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గర్వకారణంగా ఉందన్నారు. యువత కూడా జాతిపిత మహాత్మా గాంధీ చూపించిన మార్గంలో నడుచుకుంటూ దేశానికి ఉపయోగపడాలని కోరారు. గడిచిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎక్కడ అప్పులు చేసిందో తెలుసుకోవటానికి కూడా కనీసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఏదన్నా అభివృద్ధి కార్యక్రమం చేద్దామన్న ఖజానా ఖాళీగా ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారి ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు తీసుకొస్తామని ఆయన తెలిపారు.




## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**తిరుమల,మహానాడు:**
తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్మెంట్లు నిండిపోయి వెలుపల కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకు క్యూలైన్లో భక్తులు వేచి ఉన్నారు. ఇక టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. నిన్న 80,735 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని 40,524 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.19 కోట్లు వచ్చిందని టీటీడీ వెల్లడించింది.

## బాధితులను గట్టెక్కించే వరకు
# ప్రభుత్వం విశ్రమించబోదు

- బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల,మహానాడు:**
చెరువు జమ్ములపాలెం వాస్తవ్యులు కోడూరి సింగయ్య - శివకుమారి వరద బాధితులకు మేము సైతం అండగా ఉంటామని ముందుకు వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ కు 50 వేల రూపాయలు చెక్కును బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజుకి అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. ముంచెత్తిన వరదలతో సర్వం కోల్పోయిన బాధిత ప్రజలను మళ్ళీ సాధారణ స్థితికి తీసుకువచ్చి, అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.



కష్టాల నుండి వరద బాధితులను గట్టెక్కించే వరకు మన ప్రభుత్వం విశ్రమించబోదు. తోచిన సాయంతో ముందుకు రావాలని ఇచ్చిన పిలుపు మేరకు స్పందించి విరాళాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. వరద బాధితుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నా. వీరితో పాటు సాయానికి ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను అని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం సామాజిక బాధ్యత

- వెల్లటూరులో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర కిట్స్ పంపిణీ
- పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ , స్వామీజీలు

**జి.కొండూరు (వెల్లటూరు):**
ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం సామాజిక బాధ్యతగా భావించి ప్రజలకు విశేష సేవలను అందిస్తున్న అధ్యాత్మిక సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమనని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జి.కొండూరు మండలంలోని వెల్లటూరు శివారు భీమవరపాడు గ్రామంలో కష్టాలలో ఉన్న వరద బాధితులకు నిత్యావసర వస్తువుల 800 కిట్లను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు, ఫౌండేషన్ స్వామీజీలు, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఆదివారం పంపిణీ చేశారు. రూ.1500 విలువైన, నాణ్యమైన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి, ఏపీలో 2 లక్షల మందికి ప్రతిరోజూ భోజనాలు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషమన్నారు. కోవిడ్ సమయంలో కూడా అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవలను అందించారన్నారు. స్వామీ జీలను సత్కరించి, వారికి కొండపల్లి బొమ్మను బహుకరించారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ముప్పాళ్ళ మండలం, తొండపి గ్రామంలో దివంగత డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహానికి, డాక్టర్ కోడెల శివప్రసాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం సీసీ రోడ్ల పనులకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలోని గోవిందు వారి వివాహ మహోత్సవానికి హాజరయ్యి నూతన వధూవరులు అనీష్, సరలను ఆశీర్వదించారు. గ్రామంలోని నల్లబోతు మాణిక్యాలరావు నివాసం వద్ద మొక్కుబడి కార్యక్రమంలో కన్నా పాల్గొన్నారు.


## ఎంఎల్‌సీ ఎలక్షన్స్.. ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల

**విజయవాడ, మహానాడు:** కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్, ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్నాయి. ఇందుకోసం ఓటరు నమోదుకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 6 వరకు అవకాశం కల్పించారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఎన్నికలు జరిగే నియోజకవర్గాల పరిధిలో నివసించే వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ప్రావిజినల్, ఆధార్, ఓటర్ ఐడీ సమర్పించాల్సి ఉంటుంది.





**వినుకొండ పట్టణం మార్కండేయ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో “వినాయక చవితి” సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని దర్శించుకున్న వినుకొండ శాసన సభ్యుడు జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు...**



**బాపట్ల జిల్లా, అమర్తలూరు గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎంపీ కృష్ణ ప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో వేమూరు నియోజకవర్గం పరిధిలోని నాయకులు, దళిత సంఘాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**

## పోలీసు కస్టడీలో మాజీ ఎంపీ నందిగం సురేష్

**మంగళగిరి, మహానాడు:**
వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ ను విచారణ నిమిత్తం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ కు పోలీసులు తీసుకొచ్చారు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) రాష్ట్ర కార్యాలయంపై దాడికి సంబంధించిన కేసులో ఈనెల అయిదోతేదీన అరెస్ట్ చేయడంతో కోర్టు రిమాండ్ కు పంపింది. కోర్టు రెండు రోజుల పాటు సెప్టెంబర్ 15 నుండి 17 వరకు పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం విచారణ అధికారి మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
7
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 16, సెప్టెంబర్ 2024

### స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత
# ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024

- రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి గంధం చంద్రుడు



**అమరావతి,మహానాడు:**

స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ 2024 నిర్వహిస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి గంధం చంద్రుడు తెలిపారు. మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయవలసిన అవశ్యకత ఉందన్నారు.

రాష్ట్ర స్థాయిలో భాగస్వామ్య సంస్థలతో శనివారం హైబ్రీడ్ విధానంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి పోతుందన్నారు.

మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీని స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామన్నారు. "స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత" ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకుంటు న్నామన్నారు.

స్వచ్ఛతా కీ భాగీదారి విభాగంలో తగిన ప్రచారంతో ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవ గొలుసులు నిర్వహిస్తామన్నారు.

మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందరీకరణ పనులు చేపట్టవలసి ఉందన్నారు. స్వచ్ఛత లక్షిత్ ఏకాయి – సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాలలో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపుతామన్నారు.

సఫాయిమిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆరోగ్యశిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయటం వంటివి ఉంటాయన్నారు. వారికి ప్రత్యేకంగా భద్రతా శిక్షణలు పిపిఇ కిట్లు అందిస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని గంధం చంద్రుడు వివరించారు.

### జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో
# ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ అరెస్ట్?

**కోల్‌కతా, మహానాడు:**

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్కతా ఆర్ జి కర్ ఆసుపత్రి జూనియర్ వైద్యురాలి హత్యాచారం, హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విషయంలో సీబీఐ స్పీడ్ ను పెంచింది. తాజా గా ఆర్ జికర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ను సీబీఐ అరెస్టు చేసింది. మరో పోలీసు అధికారిని కూడా అరెస్టు చేసింది.

మెడికల్ కాలేజీలో అవక తవకలకు పాల్పడిన కేసులో ఇప్పటికే సందీప్ ఘోష్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా వైద్యురాలి అత్యా చారం కేసులో సందీప్ అరెస్ట్ అయ్యారు. సందీప్ ఘోష్‌ను శనివారం అర్థ రాత్రి అరెస్టు చేసిన సంగతి తెలిసిన డాక్టర్లు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఓ జూనియర్ డాక్టర్ మాట్లాడుతూ.. సాక్ష్యాలను తారు మారు చేయడం వల్ల కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, పోలీసు అధికారి అభిజిత్ మోండల్‌ను అరెస్టు చేయాలని మేము మొదట్నుంచీ డిమాండ్ చేస్తున్నాము.

ఈ అరెస్టు సంతోషం కలిగి స్తుందని తెలిపారు. సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ ఇంచార్జీ అభిజిత్ మండల్ ను సిబిఐ అరెస్టు చేయడంపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత సుకాంత మజుందార్ కూడా స్పందించారు.

ఈ రోజు చేసిన అరెస్టులు చాలా ముఖ్యమైనవని..తాలా



పోలీస్ స్టేషన్ ఇంచార్జీ అరెస్టు అత్యాచారం కేసులో అవకతవకలకు పాల్పడ్డాడనే ఆరోపణలపై అరెస్టు అయ్యారు. వాళ్లను అరెస్టు చేయాలని బెంగాల్ ప్రజలు మొదట్నుంచీ డిమాండ్ చేస్తున్నారు. ఒక చిన్న స్టేషన్ ఇంచార్జీ ఇలాంటి నిర్ణయం తీసుకోగలడా? అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రజలు సీఎంను ఆ పదవి నుంచి తొలగిస్తారా? అంటు సుకాంత ముజుందార్ ప్రశ్నించారు.







# నడి సముద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం!

- ఐదుగురు మత్స్యకారులు సురక్షితం
- ఎంపీ భరత్ దృష్టికి దుర్ఘటన
- ప్రభుత్వం ఆదుకోవాలి
- అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు

**విశాఖపట్నం, మహానాడు:**

నడి సముద్రంలో ఫిషింగ్ బోటు అగ్నికి ఆహుతైంది. ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. ఐదుగురు మత్స్యకారులతో ఆదివారం ఉదయం ఐ.ఎన్.డి. ఏపీవి 5ఎంఎం 495 నెంబర్ గల వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన మేకనైజ్డ్ బోటు చేపల వేటకు వెళ్ళింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో బోటు ఇంజిన్లో ప్రమాదవశాత్తు అగ్ని మంటలు చెలరేగాయి. బోటు పూర్తిగా దహనమైంది.

ప్రాణభయంతో మత్స్యకారులు వి.గురుమూర్తి, ఆర్. నర్సింహులు, గణగల్ల రాము, ఉమ్మడి సత్తయ్య, సురపతి అప్పన్న బోటు నుండి సముద్రంలో దూకేసి సమీపంలో ఉన్న ఏరుపల్లి ధనరాజుకు చెందిన ఐఎన్డీ ఏపీ వి 5ఎంఎం 894 బోటులో ఆదివారం సాయంత్రం సురక్షితంగా హార్బర్ కు చేరుకొన్నారు. ఈ ఘటన తెలియగానే మత్స్య శాఖ ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ జి.విజయ ఫిషింగ్ హార్బర్ కు చేరుకొని మత్స్యకారుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రమాదంపై నివేదికను ప్రభుత్వామని పంపుతామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ సముద్రంలో బోటు కాలిపోవడం దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు తగు పరిహారం చెల్లించాలని కోరారు. బోటు ఇంజన్లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని ఈ ఏడాది జూన్ 15న వేట ప్రారంభమయ్యాక ఇంతవరకు ఆరు బోట్లు ప్రమాదాలకు గురయ్యాయని వాటిలో రెండు అగ్నికి దగ్ధం అయ్యాయని చెప్పారు.

తాజాగా దుర్ఘటనను విశాఖపట్నం ఎంపీ భరత్‌కు తెలియజేశామని ఆయన వెంటనే స్పందించి, ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్టు లక్ష్మణరావుచెప్పారు. ఈ కార్యక్రమంలో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో పాటు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మరపడవల సంఘం మాజీ అధ్యక్షులు పి. సి. అప్పారావు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గనగళ్ల రాజేష్, ఉపాధ్యక్షులు మట్టా రాజు, కార్యదర్శి మున్నం బాలాజీ, జాయింట్ క్యాషియర్ బడే అనీల్, డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ బి.కె.పట్నాయక్, డాక్ ఇన్స్పెక్టర్ లీలాప్రసాద్, చీకటి రమేష్, గరికిన రవి, మెరైన్ సీఐ పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మోరియా అంటే ఏమిటి?

వినాయక చవితి వేడకల్లో 'గణపతి బప్పా మోరియా' అంటూ నినదిస్తాం. కానీ మోరియా అనే మాటకు అర్థం ఎవరికి తెలియదు. మరి మోరియా అనే మాట నినాదంగా ఎలా మారింది? ఆ పదానికి గల అర్థం ఏమిటి ? దాని వెనక ఉన్న అసలు కథ ఏమిటో తెలుసుకుందాం..

**మోరియా అసలు కథ**

15వ శతాబ్దంలో 'మోరియా గోసాని' అనే సాధువు ఉండేవాడు. అతను మహారాష్ట్రలోని పుణెకు 21 కి.మీ. దూరంలో చించ్ వాడి అనే గ్రామంలో నివసించేవాడు. ఆయన గణపతికి పరమ భక్తుడు. గణపతిని పూజించేందుకు చించ్ వాడి నుంచి మోరే గావ్ వరకు రోజూ కాలినడకన వెళ్లేవాడు. ఓ రోజు మోరియా నిద్రపోతున్న సమయంలో గణేశుడు కలలో కనిపించి.. సమీపంలో ఉన్న నదిలో తన విగ్రహం ఉందనీ.. దాన్ని తీసుకువచ్చి ప్రతిష్ఠించమని చెప్పాడట.

కలలో గణపతి చెప్పిన మాట నిజమో కాదో వెంటనే తెలుసుకోవడానికి మోరియా అక్కడున్న నదికి వెళ్లాడు. కలలో గణపతి చెప్పినట్టుగానే నదిలో మోరియాకు వినాయకుడి విగ్రహం దొరికింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు మోరియా గోసావి ఎంత గొప్పవాడు కాకపోతే సాక్షాత్తు వినాయకుడు కలలో కనిపిస్తాడు అంటూ.. మోరియాను చూసేందుకు తండోపతండాలుగా వచ్చారట.

మోరియా గోసావి పాదాలను తాకి మోరియా అనటం మొదలుపెట్టారు.. మోరియా గోసావి నిజంగా మంగళ మూర్తియే అంటూ మొక్కారట.. నది నుండి తెచ్చిన గణపతి ప్రతిమను తెచ్చి గుడిని నిర్మించాడు. మోరియా గొప్ప భక్తుడు అయ్యాడు కాబట్టి నాటి నుంచి గణపతి ఉత్సవాల్లో మోరియా గోసావి పేరు గణపతి ఉత్సవాల్లో బాగమైపోయింది.. ఆనాటి నుంచి గణపతి బప్పా మోరియా..అనే నినాదం నిర్విరామంగా వినబడుతూనే ఉంది.

భక్త వల్లభుడైన వినాయకుడి సేవలలో మోరియా గోసావి



తరించిపోయాడు అందుకే నదిలో నిమజ్జనం చేసే ముందు గణపతి బప్పా మోరియా పుఢ్చ వర్సీ లౌకర్ యా.. అని మరాఠీలో నినదిస్తాం.. ఎందుకంటే గణపతి ప్రతిమ మోరియకు మహారాష్ట్రలోని పూణే సమీపంలో ప్రవహించే నదిలోనే దొరికింది కాబట్టి.. దేవుడు తన కార్యం ఏదైనా భక్తుల ధ్వారనే నెరవేర్చుకుంటాడు అనడానికి మోరియా గోసావి జీవిత కథనే నిదర్శనం.

# రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్

- కోరుకున్న చోట ప్లాట్
- రంగంలోకి మంత్రి నారాయణ

**అమరావతి, మహానాడు:**

రాజధానిలో ల్యాండ్ పూలింగ్ కోసం రంగంలోకి మంత్రి నారాయణ దిగారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇచ్చే రైతుల ఇళ్లకు మంత్రి వెళ్ళారు. దీంతో భూములిచ్చేందుకు రైతులు ముందుకొస్తున్నారు. ఎర్రబాలెం లో 11 మంది రైతుల నుంచి 12.27 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ ద్వారా స్వీకరణకు రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో ఏమన్నారంటే... ఎవరైనా భూములు ఇవ్వాలనుకుంటే వారి ఇళ్ళకే వెళ్లి తీసుకుంటాం.. ల్యాండ్ పూలింగ్ ద్వారా ముందుగా భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న భూముల్లో ప్లాట్ ల కేటాయింపు.

భూములిచ్చిన మరుసటి రోజే ప్లాట్ ఎంపిక చేసుకునే అవకాశం. గతంలో రాజధానికి భూములు ఇవ్వని రైతులు నేడు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. భూములు



ఇచ్చే రైతుల ఇంటికి నేరుగా నేనే వస్తాను అని చెప్పాను. గతంలో భూములు ఇచ్చిన రైతులకు లాటరీ పద్ధతిలో ఫ్లాట్స్ ఇచ్చాం. ఇపుడు కొంత మేర భూములు మాత్రమే అవసరం. కాబట్టి ఇపుడు భూములు ఇచ్చే రైతులకు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నాం. ప్రభుత్వం దగ్గర ఎక్కడ భూమి ఉందో...అక్కడ వారు కోరుకున్న ప్లాట్స్ ఇవ్వనున్నాం. జగన్ ప్రభుత్వం రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అపహాస్యం చేసింది.

# సేవాభావంతో యూటీఎఫ్ ఘనకీర్తి పొందింది

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, మహానాడు:**

సామాజిక సేవాభావంతో యూటీఎఫ్ ఘనకీర్తి కైవసం చేసుకుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవం



సందర్భంగా స్వర్ణోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను ముఖ్య అతిథి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు ఆ సమాజానికి కష్టం వచ్చినప్పుడు బాధ్యతగా ముందుండి ఆదుకుంటారనే భావన ప్రజల్లో కలిగించేందుకు యూటీఎఫ్ నిర్వహించే కార్యక్రమాలు దోహద పడుతున్నాయని తెలిపారు. వరద విపత్తు నేపథ్యంలో బాధిత కుటుంబాల వారిని ఆదుకునేందుకు యూటీఎఫ్ విస్తృత సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యావ్యవస్థలో వినూత్న సంస్కరణలు తెచ్చేందుకు విద్యా సదస్సుల ద్వారా చర్చించి సమగ్ర నివేదికలు ప్రభుత్వానికి సమర్పించి విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు యుటిఎఫ్ నాయకత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ లను ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.ఏ.ఉమామహేశ్వరరావు జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.లెనిన్ బాబు, గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, నాయకులు షౌకత్ హుస్సేన్, మరీదు వరప్రసాద్, యూటీఎఫ్ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# ఛీ కొట్టినా.. సిగ్గులేని సీదిరి అప్పలరాజు!

- టీడీపీ మాజీ ఎమ్మెల్సీ మంతెన

**విజయవాడ, మహానాడు:**

పలాస ప్రజలు ఛీ కొట్టినా సీదిరి అప్పలరాజు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు.. మెడికల్ కాలేజ్ సీట్లు తగ్గిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం సిగ్గుచేటు. అప్పలరాజుకి మెడికల్ కండిషన్ సరిగా లేకనే మెడికల్ సీట్ల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మంత్రిగా వెలగబెట్టిన అప్పలరాజుకి రాష్ట్రంలో ఎమ్మెల్సీ సీట్ల సంఖ్య ఎంతో తెలియదు, ఆయన మెడికల్ సీట్ల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణాలు ప్రారంభించారు తప్ప ఒక్కటైనా పూర్తి చేశారా? సగానికిపైగా కాలేజీల నిర్మాణం పునాది దశలో ఉన్నాయి.

నిర్మాణం పూర్తికాకుండానే గతేడాది రాజమండ్రి కళాశాల ప్రారంభించారు. ప్రస్తుతం రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతి గదులు లేవు. తాత్కాలిక భవనాల్లో తరగతులు నడపాలిన పరిస్థితి నెలకొంది. పులివెందుల వైద్య కళాశాలలో 48 శాతం బోధనా సిబ్బంది లేరు. జగన్ కి ప్రచార ఆర్భాటం తప్ప 5 ఏళ్ల లో ప్రజలకు చేసింది ఏమీ లేదు. అప్పలరాజు నోరు తగ్గించు కోకుంటే తిప్పలు తప్పవు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 16, సెప్టెంబర్ 2024

## విశాఖ స్టీల్ ప్లాంట్‌పై
# మీ వైఖరి ఏమిటో చెప్పండి

### ఎన్డీఏ కూటమికి బొత్స సత్యనారాయణ సూటి ప్రశ్న

**విశాఖపట్నం,మహానాడు:**

విశాఖ స్టీల్ ప్లాంట్ కేవలం ఉత్తరాంధ్ర, విశాఖ ప్రాంతానికే కాకుండా, మొత్తం రాష్ట్రానికి సంబంధించిన అంశమని, అది రాష్ట్ర సెంటిమెంట్‌తో ముడి పడి ఉందని, 32 మంది బలిదానాలతో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

స్టీల్ ప్లాంట్‌ను 2008లో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఉన్నప్పుడు సుమారు రూ.11 వేల కోట్లతో కంపెనీని విస్తరించారని బొత్స చెప్పారు. అలాంటి పరిశ్రమను ఎన్డీఏ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ దిశగా తీసుకుపోతున్నారన్న మండలి విపక్షనేత, ఒకరి మీద ఒకరు నిందించుకోవడానికి ఇది సందర్భం కాదని, గతంలో ఆ పరిశ్రమను ఎలా కాపాడుకున్నారో ఆలోచించాలని అన్నారు.

గతంలో కూడా ఇలా ప్రైవేటీకరణ దిశలో ఆలోచించినప్పుడు, నాటి సీఎం వైయస్ జగన్, చాలా స్పష్టంగా చెప్పారని, ఇక్కడికి వచ్చి వీఎస్‌పీ కార్మిక సంఘాల నాయకులను కలిసి మాట్లాడారని, కేంద్రానికి లేఖ కూడా రాశారని గుర్తు చేశారు. ఆనాడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంటే, ఇక్కడ వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందన్న బొత్స సత్యనారాయణ, ఆ సమయంలో కేంద్రంలో ఎన్డీఏలో కీలకమైన బీజేపీకి పూర్తి మెజారిటీ ఉండగా.. ఈరోజు ఆ పరిస్థితి లేదని, కేంద్రంలో మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఉందని, వాటిపై ఆధారపడి ప్రభుత్వం కొనసాగుతోందని గుర్తు చేశారు.

ఇప్పుడు వ్యూహాత్మకంగా స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసే దిశలో వెళుతున్నారని, రెండు ఫర్నేస్‌లు ఆపేశారని.. ఈ సమయంలో కూడా అధికార పార్టీ నాయకులు ఒక్కో మాట మాట్లాడుతూ.. అందరినీ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని.. ఎమ్మెల్యే ఒకమాట. ఎంపీ ఒక మాట మాట్లాడుతున్నారని మండలి విపక్షనేత ఆక్షేపించారు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి, వారి విధానం ఏమిటో చెప్పాలని, వీఎస్‌పీ ప్రైవేటీకరణకు వ్యతిరేకమా? కాదా? చెప్పాలని.. ఏ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎంతో చెప్పించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఇక్కడకు వచ్చిన తమ అధినేత ఒక విషయం స్పష్టంగా చెప్పారన్న మండలి విపక్షనేత.. మీరు కూటమిని గెలిపించకుంటే, స్టీల్ ప్లాంట్ అమ్మేస్తారని చెప్పారని గుర్తు చేశారు. అలాగే, నాడు ఎన్నికల ప్రచారంలో ఇక్కడికి వచ్చినప్పుడు చంద్రబాబు ఏమన్నారు? ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌కళ్యాణ్ ఏమన్నారో గుర్తు చేసుకోవాలన్న ఆయన, ఆ మాటలకే వారు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. వారి మాటలు నమ్మి ప్రజలు గెలిపించారు కాబట్టి, ఆనవాయితీ ప్రకారం మోసం చేయకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

దేశంలో చాలా చోట్ల పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగితే, ఇక్కడ అందుకు భిన్నంగా జరిగిందని, పరిశ్రమ కోసం ఉద్యమించారని, 32 మంది అమరులయ్యారని గుర్తు చేసిన బొత్స, అందుకే స్టీల్ ప్లాంట్‌పై వారి విధానం ఏమిటి అన్నది ప్రకటించాలని కోరారు.

కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించానని డిప్యూటీ సీఎం చెప్పారని ప్రస్తావించిన మండలి విపక్షనేత, ఇప్పుడు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం మళ్లీ ఆ పని చేయాలని కోరారు.

'ఒక్కటే అడుగుతున్నాం. స్టీల్ ప్లాంట్‌ను ఇలాగే కొనసాగిస్తారా? లేక ప్రైవేటీకరిస్తారా? ప్రధానిగారు కూడా సమాధానం చెప్పాలి. విశాఖలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, ప్రధానిగారిని అడిగి ఏ విషయం చెబుతామని చెప్పారు. కాబట్టి, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మీ విధానం ఏమిటన్నది చెప్పాలని ప్రధానిగారిని కూడా కోరుతున్నాం'.

'అమరావతిలో రాజధాని కోసం రైతులు 35 వేలకు పైగా ఎకరాల భూమి ఇచ్చారని గొప్పగా చెబుతున్నారు కదా.. ఇక్కడి రైతులు కూడా 32 వేల ఎకరాలు ఇచ్చారు. ఆ విషయాన్ని ఎందుకు మర్చిపోతున్నారు?. ప్రధాని ఇప్పటికైనా తమ విధానం ఏమిటో చెప్పాలి? పీఎం, సీఎం స్పందించాలి' అని మండలి విపక్షనేత స్పష్టం చేశారు.

విజయవాడ వరదల బాధితులకు తమ పార్టీ నుంచి కోటి రూపాయల విలువైన సాయం చేశామన్న బొత్స సత్యనారాయణ, ఇప్పటికే లక్ష పాల ప్యాకెట్లు, రెండు లక్షల వాటర్ బాటిళ్లు ఇచ్చామని, ఒకటి, రెండు రోజుల్లో 50 వేల కుటుంబాలకు గ్రోసరీ అందజేయనున్నామని చెప్పారు.

# ఆ రూ.67.52 లక్షలు వసూలు

- అధికారుల సమక్షంలో సెప్టెంబర్ 17 నుంచి చెల్లింపులు
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



**రాజమహేంద్రవరం, మహానాడు:**

జి. యర్రంపాలెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి లో దుర్వినియోగం అయిన సొమ్ము రూ.67.52 లక్షలు వసూలు చేశామని, ఈ నెల 17 నుంచి బ్రాంచిలో చెల్లింపులు జరుపుతున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా, జి.యర్రంపాలెం బ్రాంచ్ కు చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముతాబత్తుల నానిబాబు ద్వారా కస్టమర్ లకు చెందిన డిపాజిట్‌లను దుర్వినియోగం జరిగినట్టు గుర్తించామని తెలిపారు. ఆ మొత్తాన్ని సంబంధిత ఖాతా దారులకు చెల్లింపులు జరపవలసినదిగా బ్యాంకు అధికారు లను ఆదేశించామన్నారు. ఆ మేరకు ఆ మొత్తాన్ని తిరిగి ఖాతా దారులకు చెల్లింపులు జరపాలని బ్యాంకు నిర్ణయించిందని, సెప్టెంబరు 17 మంగళవారం జి.యర్రంపాలెం బ్రాంచి వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారు ప్రత్యక్ష పర్యవేక్షణ లో జమ చేయనున్నట్టు తెలిపారు. ఆ రూ. 67.52 లక్షలను M/s విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి, బాధిత కస్టమర్‌లకు మొత్తాలను రీ యింబర్స్ చేయనున్నట్లు బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.



# ఏపీ ఉద్యోగుల ఆత్మబంధువు చంద్రబాబు


### - ఎమ్మెల్యే గళ్ళా మాధవి


**గుంటూరు, మహానాడు:**

భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వని ప్రోత్సాహకం, ఆంధ్రప్రదేశ్ లోని చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. రెవెన్యూ కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్ర రాష్ట్ర రజక ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవి హాజరయ్యి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని ప్రకటించిన సీఎం చంద్రబాబు హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్ళిన సచివాలయ ఉద్యోగుల కోసం అనేక సదుపాయాలు కల్పించారని, సచివాలయ, శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగులు వారాంతంలో హైదరాబాద్ వెళ్ళి వచ్చేందుకు వీలుగా వారానికి అయిదు రోజుల పని విధానాన్ని కల్పించారని గుర్తు చేశారు.

హెచ్‌ఆర్‌ఏను 16 శాతం నుంచి 24 శాతానికి పెంచారని, ఎన్నికల సమయంలో సీపీయస్ ను రద్దు చేస్తానని ప్రకటించి, రద్దు చేసి ఏపీ ఉద్యోగుల ఆత్మబంధువు గా చంద్రబాబు నాయుడు చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు.

ఈ సందర్భంగా అతి తక్కువ సమయంలోనే ఎన్నికల్లో పోటీచేసి భారీ మెజారిటీతో గెలిచిన మాధవిని ఆంధ్ర రాష్ట్ర రజక ఉద్యోగుల సంఘం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.







# వరద బాధితుల కోసం
# పలువురు విరాళాలు అందజేత

**హైదరాబాద్,మహానాడు:**

వరద బాధితుల కోసం పలువురు దాతలు విరాళాలు అందించారు. సీఎం చంద్రబాబును హైదరాబాద్‌లో ఆదివారం కలిసి సీఎం సహాయ నిధికి చెక్కులు అందించారు. వీరికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు.

*విరాళాలు అందించిన వారిలో....*

1. జీవీకే ఫౌండేషన్ ఛైర్మన్ జీవీకే రెడ్డి, జీవీ సంజయ్ రెడ్డి రూ.5 కోట్లు.
2. కాంటినెంటల్ కాఫీ తరపున చల్లా శ్రీశాంత్ రూ.1 కోటి 11 లక్షలు
3. చల్లా రాజేంద్రప్రసాద్ ఫ్యామిలీ ఫౌండేషన్ తరపున చల్లా అజిత రూ.1 కోటి.
4. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఛైర్మన్ అరుణ్ అలగప్ప, ఎండీ శంకర్ సుబ్రహ్మణ్యం రూ.1 కోటి 50 లక్షలు.
5. ట్రైజియో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వేములపల్లి అశోక్, రోహిత్ వేములపల్లి రూ.1 కోటి.
6. లారస్ ల్యాబ్స్ ఫౌండర్ డ సీఈఓ డాక్టర్ సత్యనారా యణ చావా, నాగరాణి చావ రూ.1 కోటి.
7. చలసాని చాముండేశ్వరి, శ్రీరామ్ రూ.25 లక్షలు
8. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ.2 లక్షలు
9. నరసింహారావు రూ.2 లక్షలు అందించారు.













Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144